ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
జులై 26, 2009

మహా భాగ్యనగరం



SP
43299

హ్యాపీ బర్త్‌డే

(౨౦౦౯ జులై ౨౬ నుంచి ౨౦౦౯ ఆగస్టు ౧ వరకు)

చిన్నారి
1సం॥జులై-26
లహరిక-శ్రీనివాస్ యాదవ్
భరత్‌నగర్

మానస
1సం॥, ఆగస్టు-1
సుభద్ర-మురళి
పాణ్యం-కర్నూలు

టి. ఉషశ్రీ
6సం॥,జులై-30
గీత-నందీశ్వరరావు
నాయుడుతోట-విశాఖపట్నం

ఎల్. శుభశ్రావ్య
3సం॥, జులై-30
యాదమ్మ-పర్వతాలు
ఆమనగల్లు-మ॥నగర్

సి. కార్తీక్‌రాహుల్
1సం॥జులై-3
రాజ్యలక్ష్మి-రమేష్
జంగాలపల్లి-విశాఖ

టి. డన్ని
1సం॥, జులై-2008
లక్ష్మి-అంజయ్య
దెబ్బడగూడ-రంగారెడ్డి

రమ్యశ్రీ
జులై-26
నీలిమ-అశోక్
కూకట్‌పల్లి-హైదరాబాద్

ఎస్. చంద్రిక
జులై
ఆదిలక్ష్మి-ప్రసాద్
విశాఖపట్నం

పి.ఎల్.వెంకటసాయి
1సం॥, జులై-2008
సుభాషిణి-నాగభూషణం
సుందరయ్యనగర్-విజయవాడ

ఎ. సాహితి(స్వీటీ)
1సం॥జులై-2008
రూన్సీ-వెంకటేష్
యనమలకుదురు-విజయవాడ

ఎం.జ్ఞాన జస్వంతి(జున్ను)
9సం॥, జులై-27
శ్రీదేవి-శివప్రసాద్
విజయనగరం

పి. నాగసాయి శ్రీనివాస్
8సం॥,జులై-27
జ్యోతి-లక్ష్మీనారాయణ
ఖమ్మం

జి. అపర్ణయాదవ్
జులై-26
పద్మావతి-బాలనాగయ్య
మార్కాపురం-ప్రకాశం

షేక్ గౌసాబీబి
4సం॥జులై-29
పర్మిణ-చందాని
యిసుకదర్శి-ప్రకాశం

సిహెచ్.లక్ష్మీప్రసన్న
1సం॥, జులై-26
శకుంతల-అంబదాస్
విద్యానగర్-కరీంనగర్

ప్రదీప్‌కుమార్
1సం॥,జులై-2008
శ్రీలత-శ్రీనివాస్
బాగ్‌లింగపల్లి-హైదరాబాద్

వి. గణేష్
జులై-31
విజయ-సమ్మయ్య
సీతంపేట్-మంథని

కథా నిలయం

మనలో మాట

ఆకర్ష.. అధికార ప్రకర్ష

రాజా వారి రాజ్యం ఆకర్షణీయంగా వెలిగిపోతోంది!

దానిక్కారణం ఈ మధ్య ప్రకటించకుండా అమలు చేస్తున్న 'ఆకర్షక్' పథకం. భూమికి గురుత్వాకర్షక శక్తి ఉన్నట్టే- అధికారానికి నాయకాకర్షక శక్తి ఉంది. అది ఏకంగా ఓ పథకంగా, ప్రయోగంగా ఆరంభమైంది రాజా వారి రాజ్యంలో! ఈ పథకం చాలా చారిత్రాత్మక, సంచలనాత్మక పరిణామాలను సృష్టిస్తుందని, రాజకీయ రికార్డులు బద్దలు కొడుతుందని రాజా వారికి గట్టి నమ్మకం.

నిజానికి మొన్నటి ఎన్నికలు రాజావారికి నిరుత్సాహం కలిగించాయి. గెలుపులు రెండు రకాలని ఆయన విని ఉన్నాడు. అందులో మొదటిది: తన బలం వల్ల సిద్ధించే విజయం. రెండోది : ప్రత్యర్థి బలహీనత వల్ల ఒనగూడే గెలుపు. రాజా వారికి నిశ్చయంగా తెలుసు, తనది రెండో తరహా విజయమని. అందుకనే స్థానిక సమరం ముంచుకొస్తున్న వేళ 'ఆకర్షక్' పథకానికి శ్రీకారం చుట్టాడు.

ఈ పథకానికి విధివిధానాలూ, సిద్ధాంత భూమికలూ బయటికి ప్రకటించలేదు కానీ, లోలోపల కచ్చితంగా ఇలాగే ఉండి ఉంటాయని రాజావారి రాజ్యంలో అందరూ అనుకుంటున్నారు. బెల్లం ఉన్న చోటికి చీమలూ, నీరున్న చోటికి కప్పలూ, ఎంగిలాకులు దగ్గరకు కుక్కలూ వెళ్లటం ఎంత సహజమో, ఎంత న్యాయమో- అధికారం ఉన్న చోటకు నాయకులు వెళ్లటమూ అంతే సహజమూ న్యాయమూ అట! అదీ, ఈ పథకానికి సిద్ధాంత భూమిక. 'అధికారం మన భుక్త హక్కు' అనేది ఈ పథకదారుల నినాదమట!! ఓ పెద్ద (అధికార) అయస్కాంతం, దాని పైన కప్ప, కింద కుక్కా... ఈ పథకానికి పతాక చిహ్నాలట!!! అధికారంవైపు గెంతడమనేది ఓ రాజకీయ పరిణతిగా, విధానంగా ఈ పథకం ప్రాచుర్యం కల్పించబోతోంది! బహుశా ఈ పథకం షరా మామూలుగా ఇందిరమ్మ, రాజీవ్ పేర్లతో కాక- 'రాజావారి ఆకర్షక అయస్కాంత పథకం' అని ప్రసిద్ధి పొందుతుంది. ఆ విధంగా రాజుగారి పేరు రాజ్యరాజ్యాల్లో ఆకర్షణీయంగా మార్మోగిపోతుంది!

అయస్కాంతంలో విజాతి ధ్రువాలు ఎంత బలంగా ఆకర్షించుకుంటాయో- సజాతి ధ్రువాలు అంతే బలంగా వికర్షించుకుంటాయి. బహుశా 'అధికార' కేంద్రకం బలంగా ఉన్నంతవరకూ 'ఆకర్ష' పథకం చెల్లిపోవొచ్చు. ఆ తరువాత ఏ క్షణానైనా 'బిగ్‌బ్యాంగ్' సంభవించవచ్చు. 'నీవు నేర్పిన విద్యే కదా నీరజాక్షా' అని ఆకర్షిత పక్షులు పాఠం అప్పగించవచ్చు.

రాజావారి రాజ్యంలో ఏదీ అసాధ్యం కాదు.
దేనికైనా సిద్ధంగా వుండాలి మరి.

★

ఈ సంచికలో....

టపా	...	2
సమ్‌థింగ్‌స్పెషల్	...	3
చూద్దామా	...	6
నేపాలీ బుల్లోడు	...	8
క్రైమ్ కథ	...	9
గని	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
తెల్సా	...	17
కవిత్వమ్	...	18
న్యాయ సలహాలు	...	19
నవ్వుల్ పువ్వుల్	...	20
కథ	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

నా ఆలోచనలకు స్పష్టతనిచ్చిన నవల

సినిమా కబుర్లు ... 5

ఆ మాట మరువలేను

రుచి ... 21

సొరకాయ హల్వా



రాజ్యాంగ విరుద్ధం

వానల కోసం యజ్ఞాలు, యాగాలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలను కోరడమే కాకుండా దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో ప్రార్థనలు చేయాలని ఆయా ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధం, అశాస్త్రీయం. ఇది డబ్బును దుర్వినియోగం చేయడమే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ(హెచ్) ప్రకారం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ప్రతి పౌరుని బాధ్యతగా పేర్కొన్నది. కానీ సి.ఎం. ఆదేశాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. యాగాలకు, యజ్ఞాలకు ఎప్పుడూ ఎక్కడా వర్షాలు కురిసిన దాఖలాలు లేవు.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

'వైశాలి' ఆసక్తికరం

కౌటిల్యాల కుటిలత్వ తీరు బాగుంది. సైకోథెరపీ తీరు తెన్నులు – మేలు చేసేనా? బెండకాయ చట్నీ బాగుంది. డ్రై ఫ్రూట్స్ మంచివి అంటారా? లేక ఒక స్టేటస్ సింబలా? వైశాలి చరిత్ర చదువుతుంటే చాలా ఆసక్తికరంగా ఉంది. ప్రణబ్ చాణక్య బడ్జెట్‌కు వందనాలు పెట్టొచ్చు. సైన్స్ ఇంత అభివృద్ధి చెందినా, సైంటిఫిక్‌గా చెప్పినా కూడా యాగాలు, యజ్ఞాలు చేస్తే వర్షాలు పడతాయనుకోవడాన్ని ఏమంటారో మరి.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

ఆటిజం గురించి చక్కగా చెప్పారు

జులై 12 వ తేదీ సంచికలో చూద్దామా శీర్షికలోని వైశాలి విశేషాలు మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆరోగ్యం శీర్షికలో చిన్న పిల్లల్లో ఆటిజం వ్యాధి రావడానికి కారణాలు, లక్షణాలను ఎలా గుర్తించాలి? ఈ వ్యాధికి ఎలాంటి చికిత్స తీసుకోవాలో తెలిపినందుకు ధన్యవాదాలు. గని సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది.

విజయలక్ష్మి, ఆదిలాబాద్.

కొత్త వంటలు కూడా కావాలి

ఈ వారం 'పరకాయ ప్రవేశం' కవిత బాగుంది. మూంగ్ పాయసం, క్యాబేజీ వడలులాంటి కొత్త వంటలు పరిచయం చేశారు. కవర్ స్టోరీలో చెప్పినట్టుగా మంత్రాలకు చింతకాయలు రాలవు, యాగాలకు వర్షాలు పడవు. యజ్ఞాలూ, యాగాలు చేస్తేనే వర్షాలు వచ్చేట్టయితే మనకు ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడ కావాలంటే అక్కడ వర్షాలు చాలా సులువుగా కురిపించేసుకోవచ్చుగా. అప్పుడు ఈ తుఫాన్లు, వరదలు, సునామీలు ఏమీ వుండవు. ప్రజలకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకుండా ఓ కొత్త లోకాన్ని సృష్టించుకోవచ్చేమో కదూ!

పాండురంగారావు, చీరాల.

జోక్స్ ప్రతి వారం కావాలి

ఈవారం స్ఫూర్తి బాగుంది. ఎండిన పళ్ల గురించి, వాటిలోని పోషక పదార్థాల గురించిన వివరాలు సమ్‌థింగ్ స్పెషల్ శీర్షిక చదివి తెలుసుకున్నాం. నవ్వుల్ పువ్వుల్ లోని జోక్స్ మమ్మల్ని ఎంతగానో నవ్వించాయి. మనలో మాటలోని 'మతిమాలిన తోటమాలి' బాగా నచ్చింది. చూద్దామాలో వైశాలి గురించిన విశేషాలు తెలుసుకున్నాం. అంతరం కథ ఆకట్టుకుంది.

కాకుమాను రాఘవయ్య,
మెదక్.



యాగాల కవర్ బావుంది

జులై 12వ తేదీ నాటి స్నేహ సంచికలో ఆరోగ్యం శీర్షికలో చిన్న పిల్లల్లో వచ్చే మానసిక సమస్యల్లో ఒకటైన ఆటిజం గురించి చాలా వివరాలు తెలుసుకున్నాం. కవర్ స్టోరీ లో వచ్చిన యాగాలకు వర్షాలు పడ్తాయా అంటే అది మనకన్నా యజ్ఞ, యాగాలు చేసిన వారికే బాగా తెలుసు. మన రాష్ట్రంలో వర్షాలు ఎంత బాగా కురుస్తున్నాయో! బాల నేస్తాలు బాగుంటోంది.

ఎం. కారుణ్య, విశాఖ.

మళ్లీ మళ్లీ చదివిస్తోంది

జులై 12 నాటి స్నేహ అట్టమీది కథ యాగాల యాగీ... రమేష్‌గారి వ్యాసం ఆలోచింపజేసింది. ఇకనైనా ప్రభుత్వం మూఢ విశ్వాసాలను పెంచి పోషించకుండా సైన్స్ వైపే అందరూ మొగ్గు చూపేలా ప్రయత్నించాలి. 'సమ్‌థింగ్ స్పెషల్'లో డ్రైఫ్రూట్స్ (డ్రైనట్స్) తీసుకునేటప్పుడు ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో చక్కగా తెలియజేశారు. 'వైశాలి విశేషాల'ను చూద్దామా ద్వారా గ్రహించాము. 116 ఏళ్ల మ్యూజియం సంగతులు 'తెల్సా' ద్వారా తెలుసుకున్నాం. రిచర్డ్ సంగతులు అబ్బురపరిచాయి. 'స్ఫూర్తి'లో చివరకు మిగిలేది? పుస్తక విశిష్టతను తెలుసుకుని ఖచ్చితంగా చదవాలని నిర్ణయించుకున్నాం. 'కవితలు' భావగర్భితంగా ఉంటూ ఆకట్టుకుంటున్నాయి. ప్రజల మనసులోని మాటలను 'మనలోమాట'గా శెలవిచ్చారు. 'నవ్వుల్ – పువ్వుల్' హాయిగా నవ్విస్తూ మళ్లీ మళ్లీ చదివేట్టు చేస్తోంది. ఇంకా విజ్ఞానవీచిక, బాల నేస్తాలు మాకు నచ్చిన శీర్షికలు.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

★





కొవ్వు తక్కువ పండు... సపోటా

సపోటా చెట్టు ఆకూ, కాయా, కొమ్మా, రెమ్మా ఏది తుంపినా పాలు వస్తాయి. సపోటా రుచి గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది. దీనితో పాటు విలువైన పోషక పదార్థాలు కూడా ఇస్తుంది. ఇందులో కొలెస్ట్రాల్ వుండదు. ఆ మాటకొస్తే కొవ్వు పదార్థాలూ చాలా తక్కువే. విటమిన్లూ, ఖనిజాలూ పుష్కలం. తాజా సపోటాలో విటమిన్ సి, కాల్షియం అధికంగా వుంటాయి.

- డా॥ విజయ్

ప్రస్తుతం అక్కడక్కడా కనిపిస్తున్న సపోటాలు చూడటానికి గులక రాళ్లలా వుంటూ, ఒక విశిష్టమైన వాసనతో ఆహ్వానిస్తూ వుంటాయి. అచ్చం రాయిలా కనిపించే సపోటాని పట్టుకుంటే కూడా గరుకుగా రాయిలాగే అనిపిస్తుంది. కానీ, మగ్గిన సపోటాను తింటే వుండే రుచి అనుభవించాలే గానీ చెప్పతరం కాదు! నోట్లో కరిగిపోతూ, కాస్త గరుకుగా, కాస్త మృదువుగా మొత్తానికి అద్భుతంగా అనిపిస్తుంది. మన దేశంలో సపోటాలు విరివిగా కాస్తాయి. అవి ఇక్కడ ఎంత ప్రాచుర్యం పొందాయంటే అసలవి ఇక్కడే పుట్టాయేమో అన్నంతగా!

పుట్టింది ఎక్కడో తెల్సా!

కానీ సపోటా జన్మస్థలం దక్షిణ మెక్సికో సమీపంలోని యుకాటాన్. చాలా ప్రాచీన కాలం నుండీ సపోటా సాగు మధ్యఅమెరికా ప్రాంతాల్లో జరుగుతుండేదని తెలుస్తోంది. క్రమక్రమంగా అది ప్రపంచమంతా వ్యాపించింది.

మన దేశంలో సపోటాను తినడానికే సాగు చేస్తారు. కానీ వేరే దేశాలలో ఈ చెట్ల నుండి వచ్చే పాలవంటి రబ్బరు ద్రవం కోసం కూడా సాగు చేస్తారు.ఆ ద్రవాన్ని చూయింగ్ గమ్, బబుల్‌గమ్‌ల తయారీలో విరివిగా వాడతారు.

పైగా మనమేమో సపోటాని తింటాం. కాదంటే దాని రసం తీసి తాగుతాం. కానీ ఇండోనేషియాలో సపోటాని ఫ్రై చేసుకుని తింటారు. మలయాలో నిమ్మరసం, అల్లం కలగలిపి సపోటాని లాగిస్తారు! బహామాస్‌లో సపోటా రసాన్ని తీసి నిలువ వుంచుతారు. వాళ్లు సపోటా గుజ్జుని రొట్టెల పిండిలో కలిపి రొట్టెలు చేసుకుంటారు. సపోటాతో జామ్‌లూ చేస్తారు. సపోటా గుజ్జుని చక్కెరతో కలిపి వుడకబెడితే అది ఎరుపు రంగులోకి మారుతుంది.

కోశాకే మగ్గేది

సపోటాలో మరో విశేషముంది. సపోటాకాయల్ని కోస్తే గానీ పండవు. అందుకే వాటిని తుంచి నేలలో గొయ్యి తీసి, అందులో మట్టి కింద కప్పెడతారు. చాలా వరకు గాలి చేరకుండా చేస్తే అవి త్వరగా మగ్గుతాయి. ఒకసారి మగ్గడం ప్రారంభమయ్యాక త్వరగా కుళ్లిపోయే ప్రమాదమూ వుంది.

ఎన్ని రకాలుగా తింటారో!

కాస్త దోరమగ్గిన పళ్లు తింటే నోరు జిగటగా అనిపిస్తుంది. సపోటా చెట్టు ప్రధాన లక్షణమైన పాల జిగురు వల్ల అలా అనిపిస్తుంది. ఇంతకు ముందే చెప్పుకున్నట్టు చెట్టుకి గాటు పెట్టి, తద్వారా వచ్చిన పాలను ఆరబెట్టి రబ్బరు వంటి లేటెక్స్ తయారు చేస్తారు. పంతొమ్మిదవ శతాబ్దంలో సపోటా జిగురును ఆంటోనియో లోపెజ్ అనే అతను తన కుమారుడు థామస్ ఆడమ్స్‌కి ఇచ్చాడు. ఆడమ్స్ ఆ తరువాత దానిలో ఇతర పదార్థాలు కలిపి 'చికిల్స్' తయారు చేశాడు.

ఆ తరువాత చికిల్స్ చిక్లెట్స్ గానూ, బబుల్ గమ్ గానూ ప్రాచుర్యం పొందాయి. కానీ కొన్ని వందల సంవత్సరాల క్రితమే మలయన్లు ఈ సపోటా జిగురును వాడేవారని తెలుస్తోంది. సపోటా చెట్టు ఆకూ, కాయా, కొమ్మా, రెమ్మా ఏది తుంపినా పాలు వస్తాయి.

సపోటా రుచికి రుచి. దీనితో పాటు విలువైన పోషక పదార్థాలను కూడా ఇస్తుంది. ఇందులో కొలెస్ట్రాల్ వుండదు. ఆ మాటకొస్తే కొవ్వు పదార్థాలూ చాలా తక్కువే. విటమిన్లూ, ఖనిజాలూ పుష్కలం. తాజా సపోటాలో విటమిన్ సి, కాల్షియం అధికంగా వుంటాయి.

సంవత్సరం పొడవునా లభించే సపోటాను వీలైనన్ని సార్లు తింటూ వుండండి. ★

కె.ఎల్. కాంతారావు

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు

నా ఆలోచనలకు స్పష్టతనిచ్చిన నవల

ఈనాటి యువత అతి సహజమైనవిగా అతి సామాన్యమైనవిగా భావిస్తున్న మద్యపానం, నగ్న చిత్రాలు, కులమత విద్వేషాలు, ప్రాంతీయ దురభిమానాలు వీటన్నిటి పెరుగుదల ఏదో యాదృచ్ఛికంగా జరుగుతున్నవి కావనీ, పెట్టుబడి దారీ పాలక వర్గాల తీవ్రమైన కుట్ర అందులో దాగి ఉందనీ తెలియజేశారు. యువతరం ఈ విషయాన్ని ఒకసారి తెలుసుకుంటే ఆ ఉచ్చులో నుండి బయటపడుతుంది. చైతన్యవంతమౌతుంది. ఇది తథ్యం. అందుకే ఈ నవల నాకు బాగా నచ్చింది. "ఏ వ్యవస్థను కోరుకుందాం" అనే దోలాయమానంలో ఉన్న నా ఆలోచనలకు స్పష్టతనిచ్చింది. ఈ వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపింది. సోషలిస్టు వ్యవస్థవైపు సాగాలి అనే స్ఫూర్తినిచ్చింది.



నేను చిన్నప్పటినుండి పుస్తకాలు విపరీతంగా చదివేవాణ్ణి. సనాతన సాంప్రదాయ భావాల నుండి సామ్యవాద భావాల దిశగా క్రమంగా నన్ను నడిపించింది అవే. వాటిలో నాకు బాగా స్ఫూర్తినిచ్చిన పుస్తకం దాశరథి రంగాచార్య రచించిన "రానున్నది ఏది నిజం" అనే చిన్న నవల. ఆ నవలలో రంగాచార్య చాలా చక్కటి శైలిలో నేటి బూర్జువా వ్యవస్థ తీరుతెన్నులను గూర్చి, సోషలిస్టు వ్యవస్థలో ప్రజల సుఖ జీవన విధానాన్ని గూర్చి చక్కగా వివరిస్తారు.

మనకు "మార్క్సిజం అంటే ఏమిటి?" "కమ్యూనిజం అంటే ఏమిటి?", "కమ్యూనిస్టులు కోరేదేమిటి?" మొదలైన సిద్ధాంత గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. వాటికి భిన్నంగా, కథా రూపంలో సామ్యవాద సమాజాన్ని వివరించడమే ఈ పుస్తక ప్రత్యేకత. కథా సారాంశమేమంటే భారతదేశంలో కార్మిక వర్గ నాయకత్వంలో విప్లవం విజయవంతమౌతుంది. కార్మిక నాయకుడు ప్రధానిగా కొత్త ప్రభుత్వం వస్తుంది. పూర్వ మంత్రి వర్గంలోని ఒక మంత్రిని అరెస్టు చేసి జైలులో పెడతారు. కొంతకాలం తర్వాత ఆ పాత మంత్రికి నూతన సమాజ నిర్మాణానికై జరుగుతున్న కృషిని గూర్చి, సమాజంలో వచ్చిన మార్పులను గూర్చి, నూతన ప్రభుత్వ ప్రధానితో సహా అనేక మంది వివరిస్తారు. ఆ సమాజంలో నేరస్థులను కఠినంగా శిక్షించరు, సంస్కరిస్తారు. నేరం చేయడానికి మూలమైన పరిస్థితులను మారుస్తారు. కొత్త ప్రధాని మాటల్లో చెప్పాలంటే "దోమలను పారదోలాలంటే మురికి గుంటలు శుభ్రం చేయడం మా విధానం – దోమల్ని చంపడం కాదు". ఎన్నికల్లో ఎన్నో పార్టీలు పోటీ చేసి, దామాషా పద్ధతిన తమ ప్రతినిధులను పార్లమెంటుకు పంపుతాయి. పిల్లల పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుంది. అంటే తల్లిదండ్రుల నుంచి వేరు చేసికాదు. వారు తల్లిదండ్రుల వద్దనే పెరుగుతారు. వారి పెంపకానికి, చదువుల కొరకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. అలాగే ఆరోగ్యఖర్చులు కూడా. విద్యాలయం కొరకు, వైద్యశాల కొరకు పాత మంత్రిగారికి చెందిన భవనాలు ఒక కుటుంబం కోసం కాకుండా సమాజం మొత్తానికి ఉపయోగపడాలని కొత్త ప్రభుత్వ భావన. అలాగే కుల, మత బేధాలు లేకుండా అంతా సమానులే అనే భావనను కొత్త ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మతాన్ని కాకుండా మూఢ విశ్వాసాలను కొత్త ప్రభుత్వం నశింపచేసింది. నిరుద్యోగ సమస్యను సమూలంగా నిర్మూలించింది. ఈ మార్పులన్నీ చూసిన పాత మంత్రిగారు "నా సొమ్ము తిని బాగుపడాలనుకుంటున్నారేమో! నాశనం చేస్తానందర్నీ" అని పెద్దగా అరుస్తుంటాడు. అప్పుడు తెలుస్తుందాయనకు పార్లమెంటులో తాను నిద్రపోతున్నానని, పైదంతా కలనీ. వెంటనే కారులో ఇంటికి బయలుదేరతాడు. ఇక్కడే గ్రంథ రచయిత సోషలిస్టు వ్యవస్థ రాకుండా వుండడానికి పెట్టుబడిదారీ వ్యవస్థలోని నాయకులు ఏంచేస్తారో చాలా సూటిగా, చాలా శక్తివంతంగా వివరిస్తాడు. రోడ్డుమీద మంత్రిగారికి నగ్న సుందరుల సినిమా పోస్టర్లు కనిపించాయి. పుస్తకాల దుకాణాల్లో బూతు పుస్తకాలు కనిపించాయి. "చాలు, ఇవి వుంటే చాలు – జనం తెలివి మీరలేదు. జాతి నిర్జీవం కావడానికి ఇంతకు మించిన సాధనాల్వేవు. చాలు – మన ఆస్తి భద్రం, మన పదవి భద్రం" అనుకుంటాడు. ఆస్తి, పదవి ఇకముందు కూడా భద్రంగా వుండాలంటే ఏం చేయాలి?

"మరికొన్ని బార్లు తెరిపించాలి. వాటిలో నగ్న నృత్యాలు ఏర్పరచాలి. సిరప్, గంజాయి విరివిగా అమ్మాలి. యువకులను నిద్ర పుచ్చాలి. అంతే కాదు, ప్రాంతీయాభిమానాలు రెచ్చగొట్టాలి. భాషపేర్న జనాన్ని పురిగొల్పాలి. నదీ జలాల వివాదాలు రేకెత్తించాలి. సరిహద్దు తగాదాలు ఉసిగొల్పాలి. మత మహమ్మారిని వ్యాపింపజేయాలి. జనాన్ని దోవ మళ్లించాలంటే ఇవే మంచి ఆయుధాలు. జై మతానికి! జై కులానికి!" అనుకుంటూ మంత్రిగారు నిద్రలోకి జారతాడు. దాంతో నవల ముగుస్తుంది.

నవలలోని గొప్పతనమేంటంటే సోషలిస్టు వ్యవస్థలో అన్ని ప్రధాన రంగాల్లో సమూలమైన మార్పులెలా ఉంటాయో, అవి ఎంత ప్రజారంజకంగా ఉంటాయో వివరించడమే కాకుండా, ఆ వ్యవస్థ రాకుండా ఉండడానికి, యువతను నిర్వీర్యం చేయడానికి పెట్టుబడి దారీ పాలకవర్గం ఏ ఏచర్యలు తీసుకుంటుందో సమర్థవంతంగా వివరించారు రచయిత. ఈనాటి యువత అతి సహజమైనవిగా అతి సామాన్యమైనవిగా భావిస్తున్న మద్యపానం, నగ్నచిత్రాలు, కులమత విద్వేషాలు, ప్రాంతీయ దురభిమానాలు వీటన్నిటి పెరుగుదల ఏదో యాదృచ్ఛికంగా జరుగుతున్నవి కావనీ, పెట్టుబడిదారీ పాలక వర్గాల తీవ్రమైన కుట్ర అందులో దాగి ఉందనీ తెలియజేశారు. యువతరం ఈ విషయాన్ని ఒకసారి తెలుసుకుంటే ఆ ఉచ్చులో నుండి బయటపడుతుంది. చైతన్యవంతమౌతుంది. ఇది తథ్యం. అందుకే ఈ నవల నాకు బాగా నచ్చింది. "ఏ వ్యవస్థను కోరుకుందాం" అనే డోలాయమానంలో ఉన్న నా ఆలోచనలకు స్పష్టతనిచ్చింది. ఈ వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపింది. సోషలిస్టు వ్యవస్థవైపు సాగాలి అనే స్ఫూర్తినిచ్చింది. అందుకే గత 30 సంవత్సరాలుగా ఈ పుస్తకాన్ని డజన్ల సంఖ్యలో కొని నా మిత్రులకు బహూకరించాను. సోషలిజం ఓనమాలు నేర్చుకోవాలనుకొనేవారు ఈ పుస్తకాన్ని తప్పక చదువుతారని ఆశిస్తున్నాను.

★

సినిమా కబుర్లు



ఆ మాట మరువలేను

అక్కినేని నాగేశ్వరరావుతో 'కాలేజీబుల్లోడు', సుమన్‌తో పలు చిత్రాలు నిర్మించిన సీనియర్ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్. ప్రస్తుతం చిత్ర నిర్మాణం ఆశాజనకంగా లేకపోయినా ఈ రంగంలోనే పెరిగినందున మళ్ళీ చిత్రాలు తీయాలనే ఆలోచనను వ్యక్తం చేస్తున్నారు. సుమన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నట్లు ప్రకటించారు. త్వరలో అక్కినేనితోకూడా చిత్రం నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్న ఈయన ప్రస్తుతం దక్షిణ భారత చలన చిత్ర సమాఖ్య గౌరవ కార్యదర్శిగా ఉన్నారు. తెలుగు సినిమారంగం కార్పొరేట్ సంస్థలు, రియల్టర్లు, రాజకీయనేతల మయమైందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చెన్నైలోని ఫిలిం ఛాంబర్‌లో ప్రస్తుత సినిమారంగానికి సంబంధించిన పలు అభిప్రాయాలను "ప్రజాశక్తి"తో తెలియజేశారు.

కృష్ణా జిల్లా విజయవాడ సమీపంలోని వల్లూరివారిపాలెంలో 1952 ఫిబ్రవరి 15న జన్మించాను. తండ్రి కాట్రగడ్డ సుబ్బారావు, తల్లి వసుమతి. హైదరాబాద్ నిజాం కళాశాలలో బి.కాం పూర్తిచేశాను. అక్క భర్త వై. హరికృష్ణ ద్వారా సికింద్రాబాద్‌లోని లక్ష్మీఫిలింస్‌లో క్యాషియర్‌గా చేరా. 1978-85లో లక్ష్మీచిత్ర పంపిణీ సంస్థలో పనిచేశాను. 85లో సొంతంగా "వసుధ" సంస్థను ఏర్పాటుచేసి కృష్ణా, గుంటూరు జిల్లాలలో పంపిణీ చేశాను. రెండు సంవత్సరాల కాలంలో సుమారు 50 చిత్రాలకు పైగా పంపిణీ చేశాను. కొన్ని చిత్రాలు లాభాలు పండించగా, మరికొన్ని నష్టాలను తెచ్చిపెట్టాయి. ఎవరో చేసిన చిత్రాలను పంపిణీ చేయడం ఏమిటనుకొని సొంతంగా సినిమాను చేద్దామనే ఆలోచనతో మద్రాసు వచ్చాను. అక్కడ ఓంకార్ ఓ పత్రికలో విలేకరిగా ఉండేవాడు. దీంతో అతనిని కలసుకొని చిత్రాలకు కథలు రాయాలని కోరాను. అందుకు అతను అంగీకరించాడు. దీంతో 1988 జనవరి 1వ తేదీన " శ్రీ అన్నపూర్ణ సినీచిత్ర " పేరుతో సొంత సంస్థను ఏర్పాటుచేసుకుని సుమన్‌తో 'బందిపోటు' చిత్రాన్ని నిర్మించాను. అప్పటినుండి సుమన్ హీరోగా పలు చిత్రాలను నిర్మించాను. ఒక రకంగా చెప్పాలంటే అన్నపూర్ణ బ్యానర్‌తో సినిమా తీస్తే అది సుమన్‌తోనే. అనంతరం "అనుపమ ప్రొడక్షన్స్" సంస్థను ఏర్పాటుచేసి అక్కినేని నాగేశ్వరరావుతో 'కాలేజీబుల్లోడు' చిత్రాన్ని నిర్మించాను. ఇప్పటివరకు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 31 చిత్రాలను నిర్మించాను.

సంవత్సరానికి 300 కోట్ల నష్టం

సినిమా రంగం సంవత్సరానికి 300 కోట్లరూపాయల నష్టాలు చవిచూస్తోంది. గత రెండు సంవత్సరాలుగా ఈ స్థితి నెలకొని ఉంది. ప్రస్తుతం నిర్మాతలు సినిమాలు నిర్మించే స్థితి లేదు. కొంతమంది తమ స్వంత బ్యానర్లపై తమ వారినే హీరోలుగా పెట్టి చిత్రాలు చేస్తున్నారు. అంతకుమించి నిర్మాత ఇతర హీరోలతో చేసే పరిస్థితి లేదు. అందుకు హీరోల నడవడిక కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చు. ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు షూటింగుకు వచ్చినపుడు ముందుగా నిర్మాత వద్దకు వెళ్ళి పలకరించేవాడు. కానీ ప్రస్తుతం నిర్మాత పొద్దున లేచింది మొదలు హీరో లేచాడా లేదా? రెడీ అయ్యాడా లేదా? అని వారి ఇంటిముందు పడిగాపులు కాచే పరిస్థితి నెలకొని ఉంది. నిర్మాత సినిమా తీయాలని కథ సిద్ధం చేసుకున్న నాటి నుండి అది హీరోలకు వినిపించాల్సి వస్తోంది. సదరు హీరో కథలో చేసే మార్పులతోటే సంవత్సరం గడిచిపోతుంది. అనంతరం నటీనటులు, టెక్నీషియన్ల ఎంపిక వారి ఇష్టప్రకారమే చేయాల్సి ఉంటుంది. దీంతో సినిమా సెట్ మీదకు వచ్చేసరికి రెండు సంవత్సరాలు వేచిఉండాల్సి వస్తుంది. కోట్లరూపాయలు ఖర్చుపెట్టి సినిమా తీసే నిర్మాత చివరకు చిన్న నటుల ముందు కూడా చేతులు కట్టుకొని నిలబడాల్సిన స్థితి దాపురించింది. గతంలో ఒక రోజు షూటింగ్‌కు 25,000 రూపాయలు వ్యయం అయ్యేది. అలాంటిది నేడు 4 లక్షల రూపాయలు అవుతోంది. హీరోలు కూడా నిర్మాతపరంగా ఆలోచించాల్సి ఉంది. నిర్మాత నిర్ణయానికి అనుగుణంగా నడుచుకుంటే ఒక చిత్రాన్ని 4 నెలలలోపు పూర్తి చెయ్యవచ్చు. హీరోలుకూడా రెండు సంవత్సరాలకు ఒక చిత్రం కాకుండా ఐదారు చిత్రాలు చేసేలా ప్రయత్నించాలి. అప్పుడు నిర్మాతలు కూడా బతికే స్థితి వస్తుంది. కార్పొరేట్ సంస్థలు, రియల్టర్లు, రాజకీయనేతల కబంధహస్తాల నుండి సినిమారంగం బయటపడి నిర్మాతే నిర్ణయాత్మక శక్తిగా అవతరించే రోజు దగ్గరలోనే ఉంది. 2006వ సంవత్సరంలో దక్షిణ భారత చలనచిత్ర సమాఖ్య కార్యదర్శిగా ఎన్నికయ్యాను. నాకన్నా ముందు ఈ పదవిలో అనేకమంది ప్రముఖ నిర్మాతలు ఉండేవారు. ఈ సమాఖ్య ఆధ్వర్యంలో తెలుగు, కన్నడ, మళయాళం, తమిళ చిత్రాలకు సంబంధించి సమస్యలను పరిష్కరించడం జరుగుతోంది. సినిమా రంగానికి సంబంధించిన సమస్యలను ఆయా ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్ళడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది. ఉత్తర భారత చలనచిత్ర సమాఖ్యతో కలసి సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాము. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తెలుగు నిర్మాతలను ఆదుకోవాలనే ఆలోచనతో తెలుగు నిర్మాతల సంక్షేమ సంఘం ఏర్పాటుచేశాం. ఇందులో నిర్మాత డివిఎస్ రాజు ప్రధాన ట్రస్టీగా, దాసరి నారాయణరావు గారు అధ్యక్షులుగా ఉన్నారు. నాతో పాటు అనేకమంది నిర్మాతలు ఇందులో ట్రస్టీలుగా ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిర్మాతల పిల్లల చదువులకు, పెళ్ళిళ్లకు ఈ సంఘం ఆధ్వర్యంలో ధనసహాయం అందిస్తాం.

భవిష్యత్ కార్యక్రమాలు.....

ఈ ఏడాది చివరలో కార్యదర్శిగా పదవీకాలం ముగియనుంది. అనంతరం నవంబర్‌లో చిత్రాన్ని నిర్మించనున్నా. ఇందుకు కథ కూడా సిద్ధమైంది. అలాగే సుమన్‌ను దర్శకుడిగా పరిచయం చేయనున్నాం. ఇందుకు ఆయన కూడా అంగీకారం తెలిపారు. అక్కినేని నాగేశ్వరరావు గారితో చిత్రాన్ని నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తున్నా. నేనంటే ఆయనకు ప్రత్యేకమైన అభిమానం. 'కాలేజీ బుల్లోడు' చిత్రం డబ్బింగ్ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎఎన్ఆర్ మాట్లాడుతూ 'నాకెరీర్‌లో డబ్బింగ్ సమయంలోనే నా పేమెంట్ సెటిల్ చేసింది నువ్వు ఒక్కడివే' అన్న మాటను నాజీవితంలో మరవలేను.

- టి. సుమన్‌కుమార్, చెన్నై

చూద్దామా

జౌన్‌పూర్ విశేషాలు

గోమతీ నదీ తీరాన నిర్మించిన జౌన్‌పూర్ చారిత్రక ప్రాముఖ్యత గల పట్టణం. ఖిల్జీ వంశస్థులు (క్రీశ 1290-1320) ముఖ్యంగా అల్లావుద్దీన్ ఖిల్జీ ఉత్తర భారతమంతా దాదాపు జయించాడు. ఈ వంశపాలన ఎంత త్వరగా విస్తరించిందో అంత త్వరగానూ అంతరించింది. ఆ తరువాత మొఘలుల రాక వరకూ, ఢిల్లీలో ఖిల్జీలపాలన నామావశిష్టమై, కుట్రలూ, కుహూకాలు, తిరుగుబాట్లు సర్వసాధారణమైపోయాయి. రాజ్యాలు స్థాపించుకున్నారు. ఇలాంటివాటిలో జౌన్‌పూర్ ఒకటి. ఇక్కడ షార్కి సుల్తానుల పాలన 84 సంవత్సరాలు సాగింది. అవధ్ గంగా పరీవాహిక ప్రాంతంలో పశ్చిమాన అలీఘర్ నుంచి తూర్పున బీహార్ వైభవాన్ని చవిచూచింది.

వీరు సంగీత సాహిత్యాలనేకాక శిల్పకళనూ ఆదరించి ఎన్నో సుందర కట్టడాలకు ఆకృతినిచ్చారు. మతమౌఢ్యంలేని, సౌభ్రాతృత్వం విలసిల్లిన సమాజాన్ని సుస్థిరం చేశారు. ప్రభుత్వంలోని అత్యున్నత స్థానాలనూ, న్యాయవ్యవస్థనూ మినహాయిస్తే, వర్తక వాణిజ్యాలలోనూ రాజ్యపాలనలోనూ హిందువులదే ఆధిక్యత. ఆనాటి పరిస్థితులలో ఇది ఎంతో అపూర్వమైన విషయం. ముస్లిం సూఫీ మహాత్ములు, హిందూ సిద్ధ పురుషులు ఒకరినొకరు ఆదరించుకునేవారు. ఆనాటి మహాపురుషులు రామానంద, చైతన్య, కబీర్, నానక్‌దేవ్ వంటివారు తమ సరళమైన ప్రవచనాలతో భక్తి మార్గాన్ని సుగమంచేస్తే, మాలిక్ మహమ్మద్ జైసీ, రాస్‌ఖాన్ వంటి ప్రముఖులు కూడా ఇదే మార్గాన్ని ఎంచుకున్నారు. ఒకరినొకరనుసరించారని కాదు. మానవుని ఆధ్యాత్మిక పురోగతిని సుగమం చేయటమే వారందరి ధ్యేయం. ఈ భక్తిభావ సమ్మేళనంతో ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరిసిందానాడు. తరువాత ఈ ప్రాంతం మొఘలుల అధీనంలోకి వెళ్ళినా, హుమాయున్ కాలంలో ఆనాటి బీహార్ గవర్నరుగానున్న షేర్షా క్రీశ 1540 లో హుమాయూన్‌ను జయించటంతో అతడు కాందహార్ (ఈనాటి ఆఫ్ఘనిస్తాన్‌లో వుంది) కు తప్పించుకుని పోయాడు. క్రీశ 1545లో షేర్షా మరణం తరువాత, హుమాయూన్ తిరిగి ఢిల్లీ, ఆగ్రాలను ఆక్రమించాడుగాని, అక్బర్ విజయయాత్రలలోగాని, జౌన్‌పూర్ మొఘలుల వశం కాలేదు. ఈ చారిత్రక నేపథ్యంలో జౌన్‌పూర్‌ను సందర్శిద్దాం.

కట్టడాలు

ఆనాటి షర్కీ వంశస్థుల కోట, ఇప్పుడు శిథిలాలతో వుంది. వీరు నిర్మించిన మసీదులలో అటలా, ఖాలిస్- ముఖ్లిస్, జాంజి, లాల్ దర్వాజా మసీదులు ముఖ్యమైనవి. వీటిలో అటలా తప్ప మిగిలినవన్నీ శిథిలాలే. హిందీభవన్ పక్కనే వుందీ అటలా మసీదు. ఇక్కడో కథ వుంది. ఒకప్పుడిక్కడ అచలాదేవి మందిరముండేదిట. అది మసీదు వెలుపల చతురస్రాకారంలో గదులు, రెండంతస్థులలో వున్నాయి. నాలుగు దిక్కులా ఏనుగులు ప్రవేశించేందుకు వీలుగా అతి పెద్ద దర్వాజాలున్నాయి. ఇది ఒకప్పుడు, అరబిక్, పర్షియన్ భాషల అధ్యయనానికి ఒక విశ్వవిద్యాలయంలా నడిచేది. దేశ దేశాలనుంచి విద్యార్థులు వచ్చేవారు. ఈ గదులన్నీ విద్యార్థుల వసతి కొరకు ఏర్పాటు చేసినవే. అతి సాధారణ జీవితం నుంచి వచ్చినా స్వశక్తితో హుమాయూన్‌ని జయించి చక్రవర్తి పదవినధిష్టించి, రోడ్లు నిర్మించటం, తపాలా వ్యవస్థను ప్రవేశపెట్టటం లాంటి ప్రగతిశీల కార్యాలకు నాంది పలికిన మహావిజేత షేర్షాసూరి, విద్యనభ్యసించినది ఈ అటలా మసీదులోనే.





లాల్ దర్వాజా

అటలా మసీదు

భూల్‌భులయ్యా

వూరికి మధ్యలో పెద్ద దిబ్బమీద ఖిల్లా వుంది. ఒక కిలోమీటరు విస్తీర్ణంలో అలనాటి వైభవానికి చిహ్నంగా మిగిలివుంది. ఇందులోని వివిధ నివాస భవనాలన్నీ శిధిలమైపోయాయి. ప్రాకారమంతా శిధిలమైపోయినా, విచిత్రమేమంటే ప్రవేశ ద్వారం మాత్రం 700 సంవత్సరాలుగా నిలబడి వుంది. లోపలకు ప్రవేశిస్తే మధ్యలో మసీదు. దీనికవతల స్నానశాల ఇంకా నిలచివున్నాయి. ఈ స్నానశాలలో ఎన్నో గదులు. అన్నిటిలోనూ నీటి తొట్టెలు. అన్నివైపులా సమాంతరంగా ప్రవేశద్వారాలతో వుండటం వల్ల మన మెటునుంచి వచ్చామో, ఎటు వెళ్లాలో తెలియక తికమకపడతాము. లక్నోలో వున్నంత కట్టడం కాకపోయినా దీన్ని కూడా భూల్‌భులయ్యా అంటారు.

గోమతీ బ్రిడ్జి

ఇక్కడ గోమతీ తీరాన ఎన్నో పురాతన స్నానఘట్టాలున్నాయి. వీటికి పైన గట్టు మీద ఎన్నో మందిరాలున్నాయి. దీనినొక పవిత్రతీర్ధంగా భావిస్తారు. దీని చరిత్ర మనకు ముస్లింల రాక నుంచి మాత్రమే తెలుసు. అంతకు ముందిది ఎంతటి పవిత్ర స్ధానమో! ఇప్పుడు గోమతీనది ఊరి మధ్యగా ప్రవహిస్తోంది. అంటే పట్టణం కాలక్రమాన, నది ఆవలిగట్టుకు విస్తరించింది. ఈ నదిపైన ఒక పురాతనమైన వంతెన మొఘలుల కాలంలో నిర్మించారు. ఇదొక వింత కట్టడం. నీరు పాయలుగా ప్రవహిస్తుంది. నీరు పారే చోట పెద్ద స్ధంభాల మీద వంతెన నిర్మించారు. పాయలు విడిన చోట కాసావే నిర్మించి దానిపైన మసీదు నిర్మించి, దాని కెదురుగా ఒక సింహపు బొమ్మను మలిచారు. ఈ తరువాత వంతెన మళ్ళీ 5 స్ధంబాల వరకూ నిర్మించారు. వంతెన నిడివికి, అప్పటి పరిజ్ఞానం మేరకు ఇలా విభజించవలసి వచ్చిందనుకుంటాను. అసలైన చిత్రమేమంటే ప్రతి స్ధంభం వద్ద వంతెన మీద చిన్న చిన్న మంటపాలు నిర్మించారు. వీటిలో వ్యాపారులు రకరకాల వస్తువులు పెట్టుకుని కూర్చుంటారు. ఊరి మధ్య నదిమీదనున్న బజారులాగ, రకరకాల జనంతో ఇక్కడెంతో సందడిగా వుంటుంది.

ఉత్సవాలు

ఇక్కడ ఫిబ్రవరి నెలలో 12 రోజుల పాటు బారాబప్వార్ అనే వేడుక జరుగుతుంది. ఇది మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు. ఇది షియాలు ఒక రోజున, సున్నీలు ఒక రోజున జరుపుకుంటారు. దీనికి హిందూ ముస్లింలందరూ విరాళాలు ఇస్తారు. అలాగే ఇక్కడ శ్రీరామనవమికి జరిగే రామలీలా వేడుకలకు గూడా ఇరుమతాల వారూ విరాళాలందజేస్తారు. ఈ సామరస్యం షర్కీల కాలం నుంచీ కొనసాగుతోందనుకుంటాను. ఈ బారాబప్వార్ వేడుకలు మేమిక్కడుండగానే జరిగాయి. వీటికి ప్రధాన కేంద్రం అటలా మసీదే. ఇది చూడటానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ఒక లక్షమంది జనం వచ్చారు. అన్ని ఠాణాల నుంచి పోలీసులూ వచ్చారు. పధాన వీధులన్నిటిలోనూ పెద్ద పెద్ద ఆర్చీలు కట్టి, కాగితపు పూలతో అలంకరించారు. చిన్న చిన్న విద్యుద్దీపాల తోరణాలతో వీధులన్నీ వేడుక శోభను సంతరించుకున్నాయి. ఊరేగింపు జరిగే వీధుల్లో ట్రాఫిక్ నిలిపివేశారు. అటలా మసీదు కళాత్మకమైన అలంకరణలో సొగసులు విరజిమ్ముతోంది. ప్రతి మొహల్లా నుంచీ వూరేగింపులు బయలుదేరాయి. వీటిలో ఉత్సాహవంతులు, కత్తియుద్ధాలు, కర్రసాముల చిత్ర విచిత్రరీతులు, కత్తితో పోరాడే వారిని ఒట్టి చేతులతో మరొకరు ఎదుర్కొని ఆ కత్తిని వశపరచుకోవటం లాంటి సాహస విన్యాసాలు ప్రదర్శిస్తూ సాగిపోతున్నాయి వూరేగింపులు. ఇవన్నీ ఊరంతా తిరిగి రాత్రి 2 గంటల ప్రాంతంలో అటలా మసీదు చేరుకున్నాయి. ఇక మిగిలిన రాత్రి అంతా భక్తిగీతాలూ, ప్రవచనాలూ ఉత్సాహభరితంగా సాగాయి. జనం కోలాహలం చెప్పనలవి కాదు. అటలా మసీదు ప్రక్కనే వుండటం వల్ల మేము కూడా ఉత్సవాన్ని తిలకిస్తూ జాగరణ చేశాము.

ఒకనాటి రాజధాని జౌన్‌పూర్ ఇప్పుడు జిల్లా కేంద్రం. ఇక చూడవలసిన విశేషాలేమీలేవు. ★



గోమతీ బ్రిడ్జి

ఈ బుల్లోడు గిన్నిస్ బుక్ ఎక్కనున్నాడోచ్



చూశారు కదండీ ఫొటోల్లోని బుల్లోడ్ని. అతని ఎత్తు కేవలం రెండు అడుగులే. వయసు మాత్రం పదిహేడు. రోజూ పత్రికలు తిరగేసేవాళ్లకి ఇతను పరిచితుడే. మరి ప్రపంచంలోకెల్లా చిన్నపిల్లోడిగా రికార్డు వుందికదా. ఆ మాత్రం గుర్తింపు వుండదా మరి! ఏంటి ఇప్పటికైనా గుర్తొచ్చిందా అతని పేరు! రాలేదా...ఇలా అయితే కష్టమేనండీ. సరే మేమే చెప్పేస్తున్నాం. ఖగేంద్ర థాప మగర్. మరి కొద్ది నెలల్లో ప్రపంచంలోకెల్లా పొట్టివాడిగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కనున్నాడు. ఈ సందర్భంగా చిన్నోడి విశేషాలు చెప్పుకుందామా!

చిన్నోడి చూపంతా గిన్నిస్ పుస్తకంమీదే వుంది. తనకు పద్దెనిమిదవ సంవత్సరం ఎప్పుడొస్తుందా? తొందరగా పుట్టినరోజు వేడుక ఎప్పుడు చేసుకుందామా అని కూడా ఆలోచిస్తున్నాడు. ఇంతకీ ఎందుకింత ఆతురత అనుకుంటున్నారా! పద్దెనిమిదో సంవత్సరం వస్తేగానీ ప్రపంచంలోకెల్లా అత్యంత పొట్టివాడిగా గిన్నిస్ పుస్తకంలో పేరు రాసుకోబోమన్నారు అధికారులు. అప్పుడు చైనా చిన్నోడు పింగ్‌పాంగ్ కిరీటం ఖగేంద్ర సొంతం అవుతుంది మరి. ఇరవయ్యేళ్ల పింగ్ ఎత్తు రెండున్నర అడుగులు. మనవాడేమో అంతకంటే అరడుగు తక్కువ ఎత్తుకదా. అందుకే ఆ ఎదురుచూపు.

సరిగ్గా పదిహేడేళ్ల క్రితం నేపాల్‌లోని ఓ కుగ్రామంలో పుట్టాడీ చిన్ని హీరో. అతని జన్మస్థలం నేపాల్ రాజధాని ఖాట్మండుకు 125 మైళ్ల దూరంలో వుండేది. పుట్టడం పుట్టడమే జనం దృష్టిని ఆకర్షించాడు. మరి అంత చిన్నగా ఎలుకపిల్లలా వుంటే విచిత్రమేకదా. అమ్మ బొజ్జలోంచి బయటికొచ్చినప్పుడు కేవలం 600 గ్రాముల బరువు వున్నాడు. చూడ్డానికి అప్పుడే గుడ్డునుంచి బయటికొచ్చిన కోడిపిల్లలా వుండేవాడని ఖగేంద్ర తల్లి అంటుంది మురిపెంగా. ఎదుగుదల చాలా తక్కువగా వుండేది. ఎనిమిదవ ఏట నడవడం మొదలెట్టాడు. పైగా తనకు పదకొండేళ్లు వచ్చేసరికే పెరుగుదల ఆగిపోయింది. మొదట్లో మాత్రం అంత చిన్ని పిల్లోడిని చూచి జనం నవ్వుతారని దాచిపెడుతుండేవారు. అయితే ఆ తర్వాత గర్వంగా ఈ చిన్నోడే మా అబ్బాయి అని చెప్పుకోసాగారు.

ఖగేంద్ర ఎత్తు, బరువే అతని సమస్య. అయితే అదే అతనికి కలిసొచ్చిన విషయం కూడా. కేవలం తక్కువ ఎత్తు వుండడం వల్లే అతని గురించి ప్రపంచవ్యాప్తంగా పరిచయమయ్యాడు. టీవీల్లో కనిపించాడు. పేపర్లలో వార్తలొచ్చాయి. వస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా గిన్నిస్ రికార్డు కూడా సృష్టించబోతున్నాడు.

అతని గురించి తక్కువగా అంచనా వేసుకోమాకండి. ఎంచక్కా రోజూ స్కూలుకెళతాడు. ఆ తర్వాత అమ్మానాన్నలకు పనిలో సాయం చేస్తాడు (చేయగలిగినంతే అనుకోండి)! ఇంకా నేస్తాలతో గోలీలు ఆడతాడు. టీవీ చూస్తాడు. డాన్స్ చేస్తాడు. డాన్స్ ప్రోగ్రాములు కూడా ఇస్తుంటాడు. మరి తన చదువుకు, ఆరోగ్యానికి, తిండికి ఖర్చు అవుతుందికదా. తనకు చేతనైనంత వరకు తనే సంపాదించుకుంటాడు. పైగా దేశంలో ఎక్కడైనా ఎగ్జిబిషన్లు జరిగినప్పుడు తల్లిదండ్రులు అతన్ని అక్కడ నిలబెడతారు. సందర్శకులు ఎంతో కొంత ఇస్తుంటారు.

తమాషా ఏంటంటే తనకు పద్నాలుగేళ్లప్పుడు కూడా గిన్నిస్ రికార్డు అధికారులను కలిశాడు ఖగేంద్ర. వారు మరో రెండేళ్లు ఆగమని చెప్పారు. ఆగాడు. ఈ ఏడాది అక్టోబర్‌లో పద్దెనిమిదో ఏట అడుగెట్టగానే మరోసారి వాళ్లను కలవనున్నాడు. ప్రపంచంలోకెల్లా అతిపొట్టివాడిగా కిరీటం అందుకోనున్నాడు.

బెస్టాఫ్ లక్ చెప్పేద్దామా! ★

క్రైమ్ కథ

కళ్లారా చూశా

- యర్నాగుల సుధాకరరావు



"**సా**ర్! రోడ్డుమీద ఒక వ్యక్తి పడిపోతే హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేశారు. తెలివొస్తే తెలియచేయమన్నారు.అతడికి నేటివరకు తెలివిరాలేదు. ఈరోజు 45వరోజు. మీకు ఒకవిషయం చెప్పాలి.అతడు ఇటు అటు కదలేది లేదు. కానీ, ఈరోజు అతడు అటు నుంచి ఇటు తిరగబడ్డాడు.ఏక్షణమైనా తెలివిరావచ్చు. మీరు వస్తే మీకు పేషెంట్ గురించి చెబుతాను" ఫోన్‌లో చెప్పాడు డాక్టర్.

"డాక్టర్‌గారు నేను కొంచెం బిజీగా ఉన్నాను. మా కానిస్టేబుల్‌ని పంపుతాను.పేషెంట్‌కి తెలివొస్తే ఎవరైంది మీరైనా తెలుసుకోండి. ఇంతవరకు ఆపేషెంట్ గురించి ఎవరూ రాలేదు" చెప్పి రిసీవర్ దించేశాడు ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర. ఆవెంటనే కానిస్టేబుల్‌ను ఆసుపత్రికి పంపాడు.

సాయంత్రం వరకు ఉండి వచ్చేశాడు కానిస్టేబుల్. పేషెంట్ అటు ఇటు కదులుతున్నాడు తప్పితే కళ్ళు విప్పలేదని చెప్పాడు. ఫోన్‌లో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ అవతలివైపు నుంచి మాట్లాడుతున్నవారితో గౌరవంగా యస్‌సార్ అంటూ మధ్యలో అంటూనే వున్నాడు. రిసీవర్ పెట్టేశాక "వాడెవడో తెలిసి చావలేదు. సరే వాడికి తెలివొస్తే నువ్వే వెళ్లి వాడి వివరాలు కనుక్కొని అతడి కుటుంబసభ్యులకు చెప్పు. నాకు నీరజ మిస్సింగ్‌కేసు ఏమిచేశారని పైఅధికారులు దంచేస్తున్నారు. చిన్న క్లూ కూడా దొరకడంలేదు" చిరాకుపడుతూ లేచి పచార్లు చేశాడు.

ఫోన్ మోగింది.రిసీవర్ ఎత్తాడు. "సార్ నేను డాక్టర్‌ని. పేషెంట్‌కు తెలివి వచ్చింది. అతడు మాట్లాడగలుగుతున్నాడు. రండి సార్" డాక్టర్ పిలిచాడు.

"మీరు కనుక్కోలేకపోయారా? చిరునామా చెప్పగలిగితే చాలు. అతడి కుటుంబానికి విషయం చేరవేస్తాం"

"మీతోనే మాట్లాడాలంటున్నాడు. ఒక ఖూనీని కళ్లారా చూశాడట. మీకే చెబుతానంటున్నాడు.రండి సార్!" డాక్టర్ ఒకింత ఆందోళనగా చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్‌కు అయోమయంగా అనిపించింది."వ్వాట్ ఏదో హత్య చూశాడా ? అందుకే అలా కోమాలోకి వెళ్లిపోయాడా? ఇప్పుడే వచ్చేస్తాను" అంటూ హాస్పిటల్‌కు వెళ్లాడు.

పీక్కుపోయిన పేషెంట్ కేవలం సెలైన్ల మీద ప్రాణాలు నిలుపుకున్నందున నీరసంతో ఏదో చెప్పాలని ప్రయత్నంలో ఉన్నాడు.తానెవరైంది చెప్పేకంటే తను చూసింది చెప్పేందుకు గొంతు పెగుల్చుకుని చెప్పాడు.విషయం విన్న ఇన్‌స్పెక్టర్ అవాక్కయ్యాడు.

వెంటనే కానిస్టేబుల్‌ను ఠాణాకు పంపించి మిస్సయిన నీరజ ఫోటో తెప్పించాడు. అది చూసిన వెంటనే పేషెంట్ "ఈమే సార్ ఆరోజు చంపబడింది. చంపిన వారిద్దరిలో ఒకడి పేరు శ్యామ్. మరొకడి పేరు నందూ" ఆపేర్లు విన్న మరుక్షణం ఇన్‌స్పెక్టర్ మెడమీద వెంట్రుకలు లేచాయి.

హత్య జరిగిన తీరు ఓపిక తెచ్చుకుని గొంతు పెగుల్చుకుని మరీ చెప్పాడు పేషెంట్. "ఆరోజు సాయంత్రం భోరున వర్షం పడుతోంది. రోడ్డుమీద నడుస్తున్న నేను అక్కడే రోడ్డుపక్కనే ఉన్న ఒకే ఒక ఇంటి వరండాలోకి వెళ్లి నిలబడ్డాను. అంతలోనే కీచుగా అరుపు విన్పించింది. తెరిచిఉన్న కిటికీలోంచి చూశాను. ఒకయువతిని కత్తులతో బెదిరిస్తున్న ఇద్దరు యువకులను చూసి అదిరి పోయాను. వాళ్లు చంపేలా ఉన్నారు. తాను వారిని ఎదుర్కొని ఆమెను రక్షించే బలశాలినికాను. ఏమిచేయాలో పాలుపోక అలా చూశాను. ఆమె ఎంత ప్రాథే యపడినా వాళ్లు పట్టించుకోలేదు. "శ్యామ్, నందూ నేను మీఆస్తుల జోలికి రాను. నన్ను వదిలేయండి. నమ్మి వచ్చాను. కత్తులతో నాపైపడుతున్నారు. అరిచి గీపెట్టినా ఇక్కడ ఎవరికీ వినపడదు. ఈరోడ్డులో ఉన్న ఒకే ఒక ఇల్లు" అని ఆమె ఏడుస్తున్నా వారు వినకుండా ఆమెను నిర్దాక్షిణ్యంగా చంపేశారు. ఆ దృశ్యం చూసిన నేను షాక్‌లోకి వెళ్లిపోయాను. అయినా అక్కడ పడిపోకుండా చేత్తో తడుముకుంటూ కాంపౌండు వాల్‌ను పట్టుకుని పూలమొక్కలపై పడుతూ లేస్తూ పెరటిలోకి వెళ్లి అక్కడ కళ్లు బైర్లు కమ్ముతుండగా నేలమీదపడిపోయాను. తరువాత తెలివొచ్చేసరికి ఆఇద్దరు హంతకులు గొయ్యి తవ్వుతున్నారు. ఆపక్కనే ఆమె శవం రక్తపుముద్దగా ఉంది. అదిచూసేసరికి తేరుకున్న నేను మరోసారి తెలివి తప్పాను. మళ్లీ ఎప్పుడు తెలివి వచ్చిందో చూసేసరికి అక్కడ ఎవరూ లేరు. గొయ్యి పూడ్చేశారు. మెల్లగా లేచి నడవలేక నడుస్తూనే కాంపౌండులోంచి ముందుకు వచ్చాను. బయట తాళాలు వేసున్నాయి. ఒక్కక్షణం అక్కడ ఉండడానికి ధైర్యం చాలక రోడ్డు మీదకు వచ్చిపడిపోయాను. ఆతరువాత మళ్లీ ఇప్పుడు కళ్లు తెరిచాను" జరిగినదంతా గుర్తుకు తెచ్చుకుని మరీ చెప్పాడు.

మరుసటిరోజు శ్యామ్, నందూలను అరెస్టుచేసి ఇంటరాగేట్ చేశాడు ఇన్‌స్పెక్టర్. వారు అనేక రకాలుగా తప్పించుకోవాలనుకున్నారు. నిజం ఒప్పుకోక తప్పలేదు. నీరజ మానాన్నకు మరో భార్య వలన కలిగింది. ఆమె మా ఆస్తులమీద కోర్టుకెక్కేందుకు సిద్ధపడింది. ఈలోగా మధ్యవర్తుల రాయభారం నడిపింది. దీనిపై మాఇద్దరం బాగా ఆలోచించి ఊరికి దూరంగా ఉన్న మరో ఇంటికి ఆమెను తీసుకువచ్చి చంపి పాతేద్దామని ప్లాన్ చేశాం. వారంరోజులుగా ఆమె కదలికలు గమనించాం. ఆరోజు సాయంత్రం ఒంటరిగా ఆమె మాకు ఎదురయ్యింది. కారు ఆపి పిలిచాం. వచ్చి కూర్చుంది. నీకు రైల్‌రోడ్డులో ఉన్న హవుస్ ఇస్తాం. కోర్టులకెక్కి మన పరువు మనం తీసుకోవద్దని కారులో చెప్పాం. ఏమీ ఇవ్వని వారు హవుస్ ఇస్తానంటే నేను ఎందుకు కోర్టుకు వెడతాను అని చెప్పి మాతో సరదాగా మాట్లాడింది. ఆతరువాత ఆ హవుస్‌లో ఆమెను చంపేసి పాతేశాం" అని జరిగినదంతా వివరంగా చెప్పారు.

ఇన్‌స్పెక్టర్ వారు చెబుతుంటే ఆసక్తిగా విన్నాడు.

ఆ తర్వాత "మీఇద్దరు నీరజను చంపేసి మాకళ్లముందే తిరుగుతున్నారు. వీలున్నప్పుడు ఆమెను వెతికిపెట్టండని కోరుతుండేవారు. మేము ఆమె హతమైందని అనుకోలేదు. మిస్సింగ్‌కేసు అంటే ఏవేవో కారణాలుంటాయి. ఏదైనా ప్రేమలో పడి ఆమె ఎక్కడికైనా వెళ్లిపోయిందంటే అలాంటివి లేవని తెలిసింది. ఇక బంధువులైన మీఇద్దరిని అడిగితే ఆమె మాకు సిస్టర్ అని ఎప్పుడు కలిసిలేము రెండు కుటుంబాలు విడిగా ఉన్నాం. నాన్న చనిపోయాక ఎవరికి వారే అయిపోయాం అని చెప్పారు" అంటూ ఇన్‌స్పెక్టర్ వారిద్దరిని సెల్‌లోకి నెట్టాడు. ★

సీరియల్

గని



జరిగిన కథ :

గనిలో పని పూర్తిచేసిన తర్వాత సారాకొట్టులో చేరతారు కార్మికులు. పీకల దాకా తాగిన ఓ కార్మికుడు గని యజమాని రాచకార్యాల గురించి చెప్తాడు. తమ కండల్ని పిప్పిచేసి వాళ్లు అలా జల్సా చేసుకుంటున్నారంటాడు. బికాస్, దిలీప్‌లు కార్మిక సంఘానికి అధ్యక్ష కార్యదర్శులుగా ఎంపికవుతారు. ఏటి ఒడ్డున కూర్చున్న బికాస్‌కు తండ్రి గుర్తొస్తాడు. అంతరానితనానికి అతను బలైన సంఘటన మదిలో మెదులుతుంది. ఆ తర్వాత...

తమిళ మూలం : **కె. చిన్నప్పభారతి**

అనువాదం : **వి. వెంకటేశ్వర**

(పదిహేడవ భాగం)

అతడిని ఎవరు తాకుతారు? మరోసారి అపవిత్రులు కావడానికి ఎవరూ సాహసించలేదు. చచ్చిపడిన పందిని చూసి, మొగం తిప్పుకొని వెళ్ళినట్టు గ్రామస్తులంతా వెళ్లిపోయారు, బికాస్ ఇంటికి వెళ్ళి నీళ్ళూ, గంజీ తెచ్చాడు. చల్లని నీళ్ళు తగలడంతో అడడికి స్పృహ వచ్చింది. ఏడుస్తూ కూచున్నాడు.

మన రెక్కల కష్టం కాస్తా మట్టిగొట్టుకుపోయింది. ఇన్నేళ్ళ జీవితంలో, ఒక్క పూటయినా ప్రశాంతంగా గడిపామా? రుచిగా భోంచేశామా? నిశ్చింతగా పడుకొన్నామా? సూటిపోటి మాటలు లేకుండా ఏ రోజయినా గడిచిందా? జంతువులు సైతం తమ స్థావరాల్లోనే పిల్లల్ని కంటాయి. కానీ మనమట్లా కాదే! పొలాల్లో కష్టపడుతూ, ఏ గడ్డివాము చాటునో, తెల్లగడ్డల పొదల్లోనో కదా పిల్లల్ని కంటున్నాం. బాలింతకయినా విశ్రాంతి లభిస్తుందా? జబ్బు చేస్తే పనిలోకి వెళ్ళకుండా పడుకోగలిగే వెసులుబాటుందా? పశువులకయినా వానలో తడవకుండా కొట్టాలు వేస్తారు. ఓటి గుడిసెల్లో పాముల మధ్యా, ఎలుకల మధ్యా మన బతుకులు. ఇప్పుడు దానికి కూడా ఎసరు పెట్టారు. అయినా తండ్రి భుజంపై ఒరిగి వెక్కివెక్కి ఏడ్చింది తల్లి.

బీదవాడికి బతుకేది? కలలో కూడా కన్నీళ్ళే కనిపిస్తాయి. మన దేవుడు కూడా మనలాగే నిస్సహాయుడు కాబోలు. కాకపోతే అగ్రకులాల దేవుళ్ళు మనకిలా శిక్ష విధించగలుగుతారా?

"మంచు కురుస్తోన్న రాత్రి మొదలు తెరల చాటు నుంచీ భూమిని చల్లగా స్పృశిస్తున్నాయి చంద్ర కిరణాలు. అంతా మసకగా ఉంది. చిన్నచిన్న గుంటల్లో నిలిచిన మురుగు నీటిలో మంచుముక్క తేలుతున్నట్టుగా జాబిల్లి నీడ. అంతటా నిశ్శబ్దం. దూరంగా గనుల్లో బొగ్గులు నిండిన ఇనుపపెట్టెల్ని క్రేన్లు జారవిడుస్తున్న శబ్దం కొన్ని మైళ్ళ వరకు వినిపిస్తోంది.

అంతటా ప్రశాంతత, సౌందర్యం వల్ల విరుస్తోన్న రాత్రి వాళ్ళకు మాత్రం కాళరాత్రిలా ఉంది. బయట వాతావరణం ఎంత శోభాయమానంగా ఉన్నా, లోపలి గాయం దాన్ని రక్తపూరితం గావిస్తోంది. ఇప్పుడేం చేయాలి? ఇక తన బతుక్కి ఏదైనా ప్రయోజనం ఉందా? సముద్ర తరంగాల్లా ఎగసి, విరిగిపడే జ్ఞాపకాలు.

భయమూ బాధా గుండెల్ని మెలిపెడుతున్నాయి. పక్షుల కూతలు. కలహమో, ప్రణయమో తెలియరావడం లేదు. ఒకటే సందడి. జంటలు జంటలుగా గూళ్ళలోకి దూరాయి కొన్ని పక్షులు. కొమ్మల మీద కూచున్న కొన్ని పక్షులు పరస్పర విశ్వాస రాహిత్యంతో పోట్లాడుకొంటున్నాయి. మరికొన్ని పక్షులు బలిష్ఠంగా ఉన్న పక్షులు బలహీనంగా ఉన్న పక్షులను తరిమేస్తున్నాయి. అంతా మానవుల వ్యవహారానికి ప్రతిబింబంగా ఉంది.

అతడి మనసులో గందరగోళం. శక్తి ఉడిగిపోతోన్న వయస్సు. వంచనా దృష్టితో కామందు దానం చేసిన పొలానికే తన శ్రమంతా వెచ్చించాడు. ఆ నేల అతడి జీవశక్తిని హరించి వేసింది. తనను స్పృశించి చదును చేసి, పదిలంగా కాపాడి, మురిసిపోయే మురికి మనుషుల్ని ఆదరించకుండా, తృణీకరించే కుసంస్కారానికి ప్రతిరూపమా భూమంటే? డబ్బును బట్టీ, పరపతిని బట్టీ ఒకర్ని తోసిరాజని మరొకర్ని అంటకాగే వెలియాలి వంటిదేనా? భూమిపై బికాస్ తండ్రిస్థాయి ఏపాటిది? ఎకరా పొలం దక్కక పూర్వం అర్ధాకలితోనైనా సరే స్వతంత్రంగానే జీవించాడు. ఇక అలా బతగ్గలడా? శిక్ష పేరిట తీర్చలేని అప్పును తలపై మోపారు. బానిసత్వంలోకి నెట్టారు. నిన్న గాక మొన్న బిడ్డల ఆకలి తీర్చడం కోసం జొన్నకంకులు కోసిన నేరానికి ఇక నష్టపరిహారం ఎలా చెల్లిస్తారు? హెచ్చరించి వదిలివేయాల్సిన తప్పులకు కూడా పెద్ద మొత్తం నష్టపరిహారంగా చెల్లించేయడానికి, విధించడానికి కారణం, ఏ వేళ పిలిచినా ఎద్దుల్లా పనిచేయడానికి బానిసలు దొరుకుతాడనేనేమో!

బికాస్ తండ్రి పొద్దున మామూలుకన్నా ఆలస్యంగా నిద్రలేచాడు. తలనొప్పి, జ్వరం. అందువల్ల ఒళ్ళు తెలియకుండా నిద్రపోయాడు. దాంతో కామందు ఆగ్రహోదగ్రుడయ్యాడు. కంటిరెప్ప మీద వాత పెట్టించాడు. రెండుమూడు రోజులు అతడు విలవిల్లాడిపోయాడు. పాతవిషయం గుర్తు రావడంతో వెన్నులోంచి వణుకు పుట్టింది. "అప్పు తీర్చలేక నేను కూడా బానిసను అవబోతున్నాను. ఇక జీవితం అధోగతే. ఇంతకంటే ఆత్మహత్య చేసుకోవడం మేలు" అని నిర్ణయించుకొన్నాడు. పెళ్ళాంబిడ్డలు గురించి ఒక్క క్షణం ఆలోచించాడు. కూతురికి పెళ్ళయింది, ఆమె అత్తగారింట్లో కాపురం చేసుకొంటోంది. ఇల్లాలూ, కొడుకూ, బతుకు బండిని ఎలాగోలా లాగించుకోగలరన్న నమ్మకం ఉంది.

ఇల్లాలు అతడి ఆలోచనల్ని కనిపెట్టింది. ఎక్కడికీ తప్పించుకు పారిపోలేమని ఆమెకు తెలుసు. ఇక జీవించడం అంటే నరకప్రాయమని గ్రహించింది. బానిస

పోయినా, అతడి భార్యకు బానిసత్వం పోదు. భర్తతో చర్చించింది. ఇద్దరూ, కలిసికట్టుగా ఆత్మహత్య చేసుకొందామని సూచించింది. బికాస్‌ను కూతురు జమునా కుమారి పెంచి పెద్ద చేస్తుందిలెమ్మంది.

తల్లిదండ్రుల వాదోపవాదాలూ, దుఃఖభారమూ తెలిసీ తెలియని స్థితిలో నిద్రపోయాడు బికాస్. తల్లిదండ్రులు పురుగులమందు తాగి కన్నుమూశారు. పొద్దున పిల్లవాడి కేకలు విని చుట్టుపక్కల గుడిసెల్లోని జనమంతా గుమిగూడారు. అంత్యక్రియలు పూర్తయ్యాక, బికాస్‌ను తనతోబాటు తీసుకెళ్ళింది జమునా కుమారి.

బికాస్ ఆలోచిస్తుంటే మంచులా ఆవరించి, మాయమయ్యాయి పాత జ్ఞాపకాలు. గతస్మృతుల బాధ తట్టుకోలేక, లేచి ఇంటిముఖం పట్టాడు.

♦ ♦ ♦

ఇంకా సాయంత్రపుటెండ పూర్తిగా తగ్గలేదు. ప్రజలు ఇళ్లకేసి గబగబా అడుగులు వేస్తున్నారు. రాత్రికి వంట చేయాలి మరి. పగలంతా పడిన శ్రమ వాళ్ళ నడకలోనూ, చూపులోనూ, మొహాల్లోనూ, ప్రతిఫలిస్తోంది.

అడవి నుంచి గడ్డిమోపు నెత్తిన పెట్టుకొని ఆవును తోలుకొస్తోంది జమునా కుమారి. ఆమె భర్త 'నందు' మేకల మందను అదిలిస్తున్నాడు. పిల్లలు లేని వారికి మేకలమందంటే వల్లమాలిన అభిమానం. అయితే అతడి వాలకం చూస్తుంటే తమను వదలి వెళ్లిపోతాడేమోనన్న భయం కలుగుతోంది. అంతే కాకుండా, అతడి చర్యల వల్ల రాత్రిపూట రౌడీమూకలతోనూ, పోలీసులతోనూ నానా తీవ్రంగా దాడి చేశారు. ఇకనైనా బికాస్ తన కార్యకలాపాలు మానుకొంటాడని జమునా నందులు ఆశించారు. అయితే అతని ధోరణి అందుకు భిన్నంగా ఉంది. యాజమాన్యంతో పోరాటం కొనసాగించేలా ఉన్నాడు. కార్మికులు అతడ్ని గట్టిగా విశ్వసించి, పదవీ బాధ్యతలు అప్పగించారు.

అకస్మాత్తుగా తల్లిదండ్రుల్ని కోల్పోయిన బిడ్డ అనాథగా, బానిసగా మారిపోకూడదన్న ఉద్దేశ్యంతో వాడ్ని తమతో తీసుకొచ్చేశారు. బళ్ళో వేశారు. ఎలాగో పదోతరగతి గట్టెక్కాడు. నిజానికి వాళ్ళ శక్తికి మించిన పనే. అయితే సంతానం లేనందువల్ల అతడినే తమ బిడ్డగా భావించి చదివించారు. ఇదంతా ఇప్పుడు గాలికి కొట్టుకుపోయేలా ఉంది. వాళ్ళ గుండెలు బరువెక్కాయి. తమ బాధ అతడు అర్థం చేసుకొన్నాడా? ఈ పోరాటాల వల్ల అతడికి ఏం జరుగుతుంది? అన్ని చిత్రహింసల కంటే క్రూరమైనది దారిద్ర్యం. ఓ నిరుపేద అనుభవించే బాధ అతడికి మాత్రమే పరిమితం కాదు, అతడి కుటుంబానికి కూడా విస్తరిస్తుంది. ఇలా తలమీదే కాకుండా గుండెల మీదా బరువు మోస్తూ తిరుగు ముఖం పట్టారు జమునా నందులు.

ఒకే కడుపులోంచి పుట్టిన అక్కాతమ్ముళ్ళ రక్త సంబంధం. తల్లిలా కంటికి రెప్పలా కాపాడి పెంచి పెద్దవాడ్ని చేసిన వాత్సల్య పూరిత హృదయం తల్లిలా విలవిల లాడింది. వెరపూ, కలవరపాటూ ఆమెను కుదిపేశాయి. ఎక్కడో విన్న మాటలు గుర్తొచ్చి ఆమెకు ఊరట కలిగించాయి. జీవితం మనకు అందించే ప్రతిదాన్నీ యధాతథంగా స్వీకరించక తప్పదు. అందువల్ల తర్వాత జన్మలోనైనా సుఖభోగాలు సంప్రాప్తించే అవకాశం ఉంటుంది. మనుషుల చేతుల్లో ఏమీ లేదు. మనం విధి చేతిలో కీలుబొమ్మలం. మన జీవితాలు ఇలాగే ఉన్నాయి!

వాళ్ళు అడవిలోంచి కాస్త ఆలస్యంగానే బయలుదేరారు. అడవిలోకి వెళ్ళగానే సర్వస్వాన్నీ మరిచిపోతారు. పసిమివన్నెతో మిసమిసలాడే చెట్టు చేమలూ, అడవిపూల నెత్తాలీ మనసును పరవశింపజేస్తాయి.

చీకటి నల్లటి రాతిబండలా భయంకరంగా వుంది. ఆకాశాన్ని కారు మబ్బులు ఆవరించాయి. కొట్టాల్లో కట్టబడిన ఆవుల కళ్ళు అద్దాల్లా వెలుగును ప్రతిఫలిస్తున్నాయి. చలి ధాటికి వెరచి జనం గడపదాటక పోవడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. నిశ్చల తటాకాల్లా దట్టంగా పరచుకొన్న మంచు కింద అణగిన మట్టి నుంచీ వెలువడుతోన్న ఆవిరి, మగ్గిపోయిన ఆకుల దుర్గంధమూ, ఆవులు, మేకలు, పందులు, కోళ్ళ మలమూత్రాల కంపూ కలగలిసిపోయి వీధుల నిండా వ్యాపించాయి.

దంపతులు ఆవునీ, మేకల్నీ కట్టేసి ఇంట్లోకి వెళ్లారు. లోపల బొగ్గుల కుంపటి వెచ్చదనం కల్గిస్తోంది. వంటపనిలో నిమ్మగ్నమై ఉన్నాడు బికాస్. గోధుమపిండిలో ఉప్పు నీళ్ళు, ఆవాల నూనె కలిపి గట్టిగా పిసికి, కొయ్య పలక కేసి బలంగా కొడుతూ, ఉండగా చేసి, మళ్లీ పిసుకుతున్నాడు. చపాతీకి పప్పు తయారుచేసి ఉంచాడు. ఇంటిపనుల పట్ల అతడు శ్రద్ధ వహించడం వాళ్ళకు ఆశ్చర్యాన్నీ ఆనందాన్నీ కలిగించింది. తమ అభీష్టాన్ని గ్రహించి, అందుకు అనుగుణంగా తనను తాను దిద్దుకుంటున్నాడేమోనన్న ఆశ మోసులెత్తింది. అతడు కుటుంబ వ్యవహారాల్లో చేదోడువాదోడుగా ఉంటే ఎంత బాగుంటుంది! పోరాటాలు, ఆందోళనల జోలికి పోకుండా గనిలో తన మానాన తను పనిచేసుకొంటూ ఇంటి పనులు చూసుకుంటూ ఉంటే జీవితం ఎంత ప్రశాంతంగా ఉంటుంది. ఇలా ఆలోచిస్తూ గడ్డి మోపును కిందికి దించింది జమునా కుమారి. గతస్మృతుల దుఃఖ భారమూ, కళ్ళెదుట కనిపిస్తోన్న సుందర దృశ్యమూ - ఈ వైరుధ్యం గజిబిజిగా ఉండడంతో ఆమె విప్పారిన నేత్రాలతో అతడికేసి చూసింది. ఏది నిజం? గతమా, వర్తమానమూ?

♦ ♦ ♦

నీలి తెరమీద వెండిపూసలు గుదిగుచ్చినట్టుంది ఆకాశం. ఎక్కడో ఓ నక్షత్రం రాలి, నిప్పురవ్వ ఎగసి, ఆరిపోయినట్టు వెలుగు తగ్గుతోంది. ఆడవాళ్ళు చేస్తున్న వంటల తాలూకు కమ్మని వాసన అలసిన దేహాల్లో ఆకలి రగిలిస్తోంది.

పిల్లల్ని కాపాడుకోవడం కోసం ముందుకురికే కాకిలా తలమీదగా రివ్వున ఎగిసింది. గబ్బిలాలు ఆహారాన్ని అన్వేషిస్తూ తోటలకేసి వెళుతున్నాయి. దొంగతనానికి దోహదపడే చీకటిలా, గబ్బిలాలకు దారి చూపుతోంది నిశి.

రాత్రి ఎన్నెన్ని రహస్యాలకు, తలుపులు తెరుస్తుంది, మూస్తుంది! ఎంతటి క్రూరత్వానికి, దుర్మార్గానికి, సుఖద ఆశ్చర్యానికి, ఏమాత్రం ఎదురుచూడని ఘటనలకు శిలా ప్రతిమలా సాక్షీభూతంగా నిలుస్తుంది!

అందరూ మిన్ను విరిగి మీదపడ్డా లేవనంత గాఢనిద్రలో ఉన్నారు, ఎరను మింగిన పాముల్లా నిశ్చలంగా. ఆమె లేచి వెలుపలకి వచ్చింది. కామోద్రేకంతో కాదు, భర్త చేసిన అప్పు తీర్చడం కోసం. అప్పు తగ్గడం లేదు. సరికదా, లాగే కొద్దీ వచ్చి పడుతోన్న ద్రౌపది వస్త్రంలా కొనసాగుతోంది.

వడ్డీ వ్యాపారి దగ్గర అప్పు తీసుకొన్నాక అంత తేల్గిగా తీర్చడం కుదరదు. జీవితాంతం వడ్డీ కడుతూనే ఉండాలి. పెళ్ళి పనుల కోసమో, వైద్యఖర్చుల కోసమో వెయ్యి రూపాయలు అప్పడిగితే ముందుగానే మూడువందల రూపాయలు వడ్డీ కింద తీసుకొని, ఏడువందలు మాత్రమే ఇస్తాడు. రోజుకు పది రూపాయల లెక్కన వందరోజులకుగాను వెయ్యి రూపాయలు కట్టాలి. జీతం తప్ప మరో ఆదాయమేదీ లేని వాళ్ళకు పెద్ద మొత్తాదులో అప్పు పుట్టదు. వందో, రెండువందలో లభిస్తాయి. తమ రోజువారీ అవసరాలను చాలా వరకు తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఒక్క వాయిదా కట్టలేకపోయినా, అప్పటి వరకు కట్టిందంతా మటాష్. వాయిదా తప్పిపోకుండా ఉండడం, కోసం మరికొంత అప్పు చేస్తారు. ఋణ పరంపర కొనసాగి మొత్తం కుటుంబం దాస్య శృంఖలాల్లో ఇరుక్కొంటుంది. గత్యంతరం లేని పరిస్థితిలో స్త్రీలు తమ దేహాలను పణంగా పెడతారు.

పాండవులు జూదంలో సర్వస్వమూ కోల్పోయినట్టు, మొగుడు పేకాటలో అంతా పోగొట్టుకొన్నాడు. ప్రాణాలను పణంగా పెట్టి సంపాదించినదంతా పేకాటలో తగలేశాడు. పోగొట్టుకొన్నదంతా చేజిక్కించుకోవచ్చన్న వెర్రి నమ్మకంతో పేకాటకు వెళ్ళాడు. తనకు తెలియకుండానే ఇల్లాలి శీలాన్ని పణంగా పెట్టాడు. దాన్నతడు వస్తుమార్పిడిగా భావించి, ఊరట చెందాడు. తనకంటె ఉన్నతస్థితిలో ఉన్న వాళ్ళు తన చర్యను సమర్థించేటట్టు జాగ్రత్త వహించాడు.

అతని అన్న లోయర్ గంగా గనిలో పనిచేస్తున్నాడు. దాని యజమాని తన మేనేజరుకు ఓ విలాసవంతమైన బంగ్లా కట్టించి ఇచ్చాడు. గృహప్రవేశం రోజున మేనేజరు భార్యను కౌగలించుకొని, చుంబించి, ఇంటి తాళం చెవులు ఆమెకు అందించాడు. ఓ ఖరీదైన కారు తాళం చెవి మేనేజరు చేతిలో పెట్టాడు. గని అభివృద్ధికీ, కార్మికులలో పర్యావరణ స్పృహ పెంపొందించిన దానికీ లభించిన కానుకగా అభివర్ణించాడు. "దేనికైనా డబ్బే గీటురాయి. దాని నేపథ్యంలో కొనసాగే నికృష్ట చేష్టలు కూడా ఉన్నతంగా పరిగణింపబడతాయి." అని చెత్త ఆలోచనలకు మలామా పూసే మొగుడి అంతర్యం గ్రహించి మనస్సును చంపుకోవాల్సిన దుస్థితి ఆమెది.

(ఇంకావుంది)

గిఫ్ట్ బ్యాగ్ చేద్దామా...

హాయ్ ఫ్రెండ్స్... మీరు మీ ఫ్రెండ్స్ పుట్టిన రోజుకో, మరేదైనా పార్టీలకో వెళ్లి ఏదైనా గిఫ్ట్ ఇవ్వాలనుకోండి. ఏమిస్తారు. ఏదో షాపుకి వెళ్లి కొనేస్తారు. అవునా? అలా కాకుండా మీరే స్వహస్తాలతో తయారు చేసి అందంగా అలంకరించి ఇచ్చారనుకోండి. ఎలా వుంటుంది. భలేగా వుంటుంది కదూ.

<u>కావలసిన వస్తువులు :</u> సాదా బ్యాగు ఏదైనా, ఫెవికాల్, శాటిన్ రిబ్బన్, స్టిక్కర్లు, పాతవి ప్లాస్టిక్ పూలు ఇలా... ఏవైనా వాడుకోవచ్చు.

<u>ఎలా తయారు చేయాలంటే...</u> సాదా బ్యాగును తీసుకోవాలి. దీనిని పట్టుకోవడానికి హ్యాండిల్ కూడా ఉంటే బాగుంటుంది. శాటిన్ రిబ్బన్‌ని మీ కిష్టమైన ఆకారంలో కత్తిరించుకొని ఫెవికాల్‌తో అతికించేయొచ్చు. అలాగే ప్లాస్టిక్ పూలని, స్టిక్కర్లని మీకు నచ్చిన విధంగా అతికించేసి చూడండి. ఇక్కడ చెప్పినట్టే కాకుండా మీ ఆలోచనలకు తగ్గట్టుగా ఎలాగైనా తయారు చేసుకోవచ్చు.

ఆ అక్షరమేదో...!

హాయ్ ఫ్రెండ్స్... కిందున్న చిన్న చిన్న ముక్కలను కలిపితే ఒక ఇంగ్లీష్ అక్షరం వస్తుంది. మరి కొంచెం జాగ్రత్తగా చూసి ఆ ముక్కలన్నింటిని అతికించేస్తే సరి.





నేర్చుకుందాం



తేడాలు కనిపెడదామా...

చుక్కలు కలిపేద్దాం!



పదాన్ని గుర్తించారా...

నేస్తాలూ! కింద ఒక వస్తువు పేరు తికమకగా రాసుంది. దాన్ని సరిగ్గా ఇక్కడిచ్చిన గళ్లలో నింపండి. ఈ పదంలో రెండు చిన్న పదాలు వున్నాయి. మీకొక క్లూ కూడా ఇస్తున్నాం. అదేంటంటే దీనితో మనం ప్రతిరోజు జుట్టుని శుభ్రం చేస్తాం.



తప్పేంటి?

నేస్తాలూ... కిందున్న బొమ్మని జాగ్రత్తగా చూడండి. దీనిలో కొన్ని తప్పులున్నాయి. అవేంటో చెప్పండి. మీకో క్లూ . అదేంటంటే ఇక్కడ టీవీ, విసీఆర్, మైక్రోవేవ్ ఓవెన్ కనిపిస్తున్నాయి. ఇంకా గాంధీగారు అప్పుడే చనిపోయారని పేపర్లో రాశారు. ఇంకా మీకు తెలియకపోతే మాత్రం జవాబు చూడండే.

XYZ ABCDEFGHIJKLMNOPQRSTUVW

అవేంటి?

నేస్తాలూ... మీకు ఇంగ్లీష్ అక్షరాలలో ఓవెల్స్ తెలుసుకదా. ఆ.. అవే a, e, i, o, u. వీటితో రెండు పదాలు రాయాలి. ఎలా అంటే

1. పదంలో 7 అక్షరాలు ఉండాలి. ఒక్కటి కూడా ఓవెల్ రాకుండా రాయాలి.
2. ఈ పదంలో కూడా 7 అక్షరాలే వుండాలి. దీనిలో అన్నీ ఓవెల్స్ ఉండాలి.

జవాబులు

తప్పేంటి?: ఈ బొమ్మలో గాంధీగారు చనిపోయారని ఉంది. కానీ గాంధీగారు చనిపోయినప్పటికి టీవీ.వీసీఆర్. మైక్రోవేవ్ ఓవెన్ ఇవేమీ ఇండియాలోకి రాలేదు.

తేడాలు కనిపెడ్తామా... : మనిషి మెడలోని టై, ఏనుగు దంతం, జోకర్ టోపీ, బక్కెట్ హాండిల్, బక్కెట్ పక్కనున్న కర్ర

పదాన్ని గుర్తించారా:
hair brush

ఆ అక్షరమేదో...:

పదాన్ని గుర్తించారా:
1 rhythm
2 sequoia



మహా భాగ్యనగరం

- వి. రాజగోపాల్

ఒకప్పటి భాగ్యనగరం, ప్రేమనగరం ఇప్పుడు మహాభాగ్యనగరమైంది. ముత్యాల నగరంగా ప్రసిద్ధిగాంచిన హైదరాబాద్ 'గ్రేటర్'గా మారింది. నాలుగు వందల ఏళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో ఈనగరం ఎన్నో చారిత్రక సంఘటనలకు వేదికగా నిలిచింది. చరిత్రే తానై, చరిత్రలో భాగమై, ఇప్పుడు చరిత్ర సృష్టిస్తోంది. 1589వ సంవత్సరంలో రూపుదిద్దుకున్న భాగ్యనగరమే ఒక విశిష్టత అయితే ఆ తరువాత అటువంటివి ఎన్నో! ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చారిత్రక కట్టడాలకు మారుపేరుగా నిలిచింది. భిన్నమతాలు, విభిన్న సంస్కృతులు, ఎన్నో భాషల కలయికతో సరికొత్త వారసత్వాన్ని సంతరించుకొంది. మినీ భారతానికి అసలు సిసలు నమూనాగా నిలిచింది. ఆటుపోట్లకు ఏమాత్రం చలించక, ముందుకు సాగడమే హైదరాబాద్ ప్రత్యేకత. ప్లేగు రక్కసి విరుచుకుపడినా, మూసీ వరదలతో ముంచెత్తినా, మతోన్మాద ముష్కరులు మారణకాండలు సాగించినా ఇక్కడి ప్రజలు సమైక్యంగా కదులుతారు. కష్టాల కడలిని అలవోకగా దాటేస్తారు. అందుకే హైదరాబాద్ పేరు వింటేనే తెలుగువారి హృదయాలు సమైక్యంగా పులకరిస్తాయి. మన గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు సిద్ధమౌతున్న నేపథ్యంలో ఘనమైన గతం ఒకసారి గుర్తుచేసుకుందామా!

అశోకుని కాలం నుండే ...!

క్రీస్తు పూర్వం 3వ శతాబ్దంనుండే హైదరాబాద్ పరిసరప్రాంతాలు ఉనికిలో ఉన్నాయి. మౌర్య చక్రవర్తి అశోకుని పాలనలో ఈ ప్రాంతం కొంతకాలం ఉండింది. ఆ తరువాత కాలంలో బౌద్ధ, హిందూ మతాలకు చెందిన రాజులు హైదరాబాద్ పరిసర ప్రాంతాలను పరిపాలించారు. చాళుక్యుల అనంతరం స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న కాకతీయుల ప్రాభవమూ వరంగల్ కేంద్రంగా కొంతకాలం కొనసాగింది. కాకతీయుల్లో చివరి చక్రవర్తి ప్రతాపరుద్రుని పతనానంతరం మహమ్మద్‌బిన్ తుగ్లక్ సేనలు ఈ ప్రాంతంలోకి ప్రవేశించాయి. క్రీస్తు శకం 1321లో ఈ పరిణామం చోటుచేసుకుంది. అప్పటినుండి 15వ శతాబ్దం వరకు బహమనీ సుల్తానులకు, ముసునారి నాయక్‌లకు, విజయనగర రాజులకు మధ్య ఆధిపత్యపోరు కొనసాగింది. ఈ పోరులో బహమనీ సుల్తానులే పై చేయి సాధించారు. 15వ శతాబ్దం మధ్యలో వారి అధికారం సుస్థిరమైంది.

కుతుబ్‌షాహిల పాలనలోకి

తెలంగాణా ప్రాంతంలో తలెత్తిన ఘర్షణలను అదుపులోకి తీసుకురావడానికి 1463లో సుల్తాను కులీ ఖుతుబ్ అల్ ముల్క్‌ను ఢిల్లీ సుల్తాన్ల ప్రతినిధిగా ప్రాంతానికి వచ్చాడు. ఘర్షణలను అదుపులోకి తీసుకువచ్చిన తరువాత ఈ ప్రాంతం కూడా ఆయన ఏలుబడి కిందకే వచ్చింది. కాకతీయుల కాలంనాటి గోల్కొండకోటను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాడు. 1518లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్న ఆయన గోల్కొండ సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేశాడు. కుతుబ్‌షాహిల పాలన అలా ప్రారంభమైంది.

భాగ్యనరం అయ్యిందిలా

కుతుబ్‌షాహి వంశానికే చెందిన మహమ్మద్ `కులీ ఖుతుబ్‌షా తన రాజధానిని గోల్కొండ నుండి మరో ప్రాంతానికి తరలించాలని భావించాడు. స్థలాన్వేషణలో గోల్కొండకోటకు తూర్పున ఐదుమైళ్ల దూరంలో ఉన్న మూసీనదీ పరిసరప్రాంతం అనువైనదిగా నిర్ధారించాడు. అంతే అక్కడ ఒక కొత్త నగర నిర్మాణం ప్రారంభమైంది. 1589లో ఈ నిర్మాణం పూర్తయ్యింది. అదే మన భాగ్యనగరం... హైదరాబాద్! తన భార్య భాగమతి (హైదర్ మహల్) పట్ల ఉన్న ప్రేమతో ఈ నగరాన్ని ఆమెకు అంకితమిస్తున్నట్లు ఆయన ప్రకటించాడు. భాగమతి పేరు హైదర్‌మహల్‌గా మార్చుకోవడంతో ఈ నగరం హైదరాబాద్‌గా మారింది. అలా భాగ్యనగరం చరిత్రలో తొలిసారి స్థానం పొందింది. చార్మినార్ నిర్మాణాన్ని కూడా ఆయనే చేపట్టారు. అప్పట్లో పెద్దఎత్తున విరుచుకుపడి తీవ్ర నష్టం కలిగించిన ప్లేగు వ్యాధి నివారణకు గుర్తుగా, భగవంతునికి కృతజ్ఞతలు

తెలుపుతూ ఆయన ఈ చారిత్రక కట్టడ నిర్మాణాన్ని చేపట్టినట్లు చెబుతారు. చార్మినార్ నిర్మాణానికి కొన్ని సంవత్సరాల ముందుగానే పురానా పూల్ (పాత బ్రిడ్జి) నిర్మాణం మూసీ నదిపై పూర్తయింది.



ముత్యాల నగరం

కుతుబ్‌షాహిల పాలనలో హైదరాబాద్ ముత్యాలనగరంగా కూడా ప్రపంచ ప్రసిద్ధిపొందింది. 16, 17 శతాబ్దాల్లో ఇక్కడ పెద్ద ఎత్తున వజ్రాలు, ముత్యాల వ్యాపారం సాగింది. ఇప్పటికీ వివిధ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు చార్మినార్ పరిసర ప్రాంతాల్లో మంచి ముత్యాల కోసం ఆరా తీస్తూ ఉండటాన్ని గమనించవచ్చు. ఆ వంశంలోని ఏడుగురు సుల్తాన్లు కూడా ఇండో పర్షియన్, ఇండో ఇస్లామిక్ సాహిత్యాన్ని, సంస్కృతిని పెంపొందించారు. వీరిలో కొందరు స్థానిక తెలుగుభాష అభివృద్ధికి కూడా కృషి చేశారు. 16వ శతాబ్దం నుండే ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడకు వచ్చి స్థిరపడటం ప్రారంభమైంది. ఇక్కడి వాతావరణం అనుకూలించడంతో పెద్ద ఎత్తున తోటలను (బాగ్)లను సాగుచేశారు. దీంతో తోటలకు కూడా ఈ ప్రాంతం ప్రసిద్ధికెక్కింది. ఇతర ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు ఇరాన్‌లోని అత్యంత సుందర నగరం 'ఇస్ఫాన్'తో హైదరాబాద్‌ను పోల్చేవారు.

మొఘలాయి పాలన

17వ శతాబ్దం మధ్యలో హైదరాబాద్ తన ప్రాభవాన్ని కోల్పోయింది. మొఘలాయిల పాలనలోకి వెళ్లింది. 1666లో షాజహాన్ మరణం తరువాత అధికారంలోకి వచ్చిన ఔరంగజేబు ఈ ప్రాంతంపై కన్నేశాడు. అభేద్య దుర్గమైన గోల్కొండను 1686లో ముట్టడించాడు. నెలల తరబడి ఈ ముట్టడి కొనసాగింది. విజయం కనుచూపుమేరలో లేకపోవడంతో నిరాశతో 1687లో వెనుతిరిగిన ఔరంగజేబు ఫతేమైదాన్‌కు (ప్రస్తుత ఎల్‌బి స్టేడియం) చేరుకున్నాడు. తొమ్మిదినెలల పాటు అక్కడే బసచేశాడు. చివరకు గోల్కొండ కోటలోని ఒకరికి భారీగా ముడుపులు చెల్లించి, కోట గేట్లు అర్ధరాత్రి పూట తెరిచే ఏర్పాటు చేసుకున్నాడు. దొంగచాటుగా కోటలోకి ప్రవేశించిన ఆయన కుతుబ్‌షాహిల వంశంలోని ఏడవ సుల్తాన్ అబుల్ హసన్ తానా షాను బందీగా పట్టుకున్నాడు. అలా హైదరాబాద్ పరాధీనమైంది. ముత్యాలనగరంగా ప్రసిద్ధికెక్కిన హైదరాబాద్ ఘనత ఈ సంఘటనతో వెలవెలబోయింది. కొన్ని దశాబ్దాల పాటు మొఘలాయిల పాలన కొనసాగింది.

నిజాం ఏలుబడి

ఔరంగజేబు మరణానంతరం మొఘల్ చక్రవర్తులు హైదరాబాద్‌కు (1707లో) గవర్నర్ జనరల్‌ను నియమించారు. 1724లో ఆసఫ్ జా 1, నిజాం ఉల్ ముల్క్ (గవర్నర్ ఆఫ్ ద కంట్రీ) సుబేదారుగా నియమితులైనారు. ఔరంగజేబు మరణానంతరం ఔరంగాబాదు రాజధానిగా స్వతంత్ర రాజ్యాన్ని ప్రకటించుకున్నారు. కాలక్రమంలో ఈ రాజ్యానికి మళ్లీ హైదరాబాదే రాజధాని అయింది. ఆసఫ్‌జా వంశీయులే ఆ తరువాత నిజాం రాజులుగా ప్రసిద్ధి పొందారు. అలా ప్రారంభమైన నిజాం పాలన బ్రిటిష్ కబంధ హస్తాల నుండి భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత ఒక ఏడాది వరకు కొనసాగింది. ఏడుగురు నిజాం రాజుల పరిపాలన సాగింది. నిజాంసాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ వంటి భారీ చెరువుల నిర్మాణం జరిగింది. భారతదేశంపై ఆధిపత్యం కోసం బ్రిటిష్, ఫ్రెంచ్ వారి మధ్య జరిగిన పోరులో నిజాం రాజులు వ్యూహాత్మకంగా వ్యవహరించి తమ అధికారాన్ని నిలుపుకున్నారు. ఒక్కో సమయంలో ఒకొక్కరికి వీరు మద్దతిచ్చారు. మూడవ నిజాం సికిందర్ జా కాలంలో ఫ్రెంచ్ సైన్యానికి సికింద్రాబాద్‌లో ఆతిథ్యం ఇచ్చారు. ఆ వెంటనే బ్రిటిష్ సైన్యానికి కూడా అదేరకమైన మర్యాదలు జరిగాయి. బ్రిటిష్ ప్రతినిధి ఒకరు హైదరాబాద్‌లోనే మకాం వేసినా, వారి సైన్యం సికింద్రాబాద్‌లోనే కొనసాగినా నిజాం ప్రభువుల సార్వభౌమాధికారానికి ఎటువంటి ఆటంకం కలగలేదు. విస్తీర్ణంలో ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్‌ల కన్నా పెద్దదైన సామ్రాజ్యాన్ని ఏలుతున్న నిజాం ప్రభువుకు 21 తుపాకులతో బ్రిటిష్ సైన్యం శాల్యూట్ చేసేది. హైదరాబాద్ రాష్ట్రం సొంతగా కరెన్సీని ముద్రించేది. సొంత రైల్వే, పోస్టల్ వ్యవస్థలు ఉండేవి. అయితే, వీరి పాలనలో స్థానిక హిందువులపై పెద్దఎత్తున దాడులు జరిగేవి. వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగింది. తెలుగుభాషను సైతం అణగదొక్కారు. ఉర్దూ మీడియం స్కూళ్లను పెద్దఎత్తున ప్రారంభించారు. 1893వరకు పర్షియన్ భాషకు అధికారహోదా లభించగా, ఆ తరువాత 1948 వరకు ఉర్దూ అధికారభాషగా కొనసాగింది. నిజాం పాలనలో తెలుగ భాష నిరాదరణకు గురయింది. ఫ్యూడల్ పాలన వల్ల ప్రజలు నానా అగచాట్లు పడ్డారు. పాలకుల అండతో గ్రామాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. భూమికోసం, భుక్తికోసం, వెట్టి చాకిరి విముక్తికోసం నినదించక తప్పని పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లో ఆంధ్రమహాసభ ఏర్పడింది. వీరతెలంగాణా విప్లవపోరాటం మొగ్గ తొడిగింది. ఐదేళ్లపాటు కొనసాగింది.

స్వాతంత్ర్యానంతరం...

1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందాక కూడా నిజాం తన ఏలుబడిలో ఉన్న ప్రాంతాన్ని స్వతంత్రభారతంలో విలీనం చేయడానికి నిరాకరించాడు. మరోవైపు రజాకర్ల ఆగడాలు మితిమీరాయి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని సాయుధపోరాటం భూములను భూస్వాముల నుండి లాక్కొని పంచేస్తోంది. ఈ

మహానగరం అయ్యిందిలా

2005వ సంవత్సరంలోనే మహానగరాన్ని (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ కోర్టు వివాదాల కారణంగా జాప్యమైంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల అనంతరం 2007 ఏప్రిల్ 16న గ్రేటర్ ఏర్పాటుకు 261వ నెంబర్ జీఓ వెలువడింది. మహానగరం ఏర్పాటుతో హైదరాబాద్‌లో 12 మున్సిపాల్టీలు, 8 గ్రామపంచాయతీలు కలిశాయి. ఎల్‌బినగర్, గడ్డిఅన్నారం, ఉప్పల్, మల్కాజిగిరి, కాప్రా, అల్వాల్, కుతుబుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు మున్సిపాల్టీలతో పాటు శంషాబాద్, సాతంరాయి, జాలపల్లి, మామిడిపల్లి, మంఖల్, అల్మాస్‌గూడ, సర్దార్‌నగర్, రావిరాల పంచాయతీలు హైదరాబాద్‌లో భాగమయ్యాయి. దీంతో 650 చదరపు కిలోమీటర్ల పరిధిలో 67 లక్షల జనాభాకు హైదరాబాద్ విస్తరించింది. గ్రేటర్ హైదరాబాద్‌ను ఐదు జోన్లగా, 150 వార్డులుగా విభజించారు. ముంబాయి, చెన్నై, బెంగుళూరుకన్నా పెద్దదిగా అవతరించింది కాబట్టే మహానగర ఎన్నికలు రాజకీయపార్టీలకు ప్రతిష్టగా మారాయి.



లుంబినీ పార్కు

నేపథ్యంలో భారత ప్రభుత్వం 'ఆపరేషన్ పోలో' ప్రారంభించింది. 1948 సెప్టెంబర్ 16న భారత ఆర్మీ హైదరాబాద్ రాష్ట్రంలోకి ఐదు వైపుల నుండి ప్రవేశించాయి. నాలుగురోజుల తరువాత నిజాం లొంగుబాటును ప్రకటించాడు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైంది. మొట్టమొదటిసారిగా అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలోని 18 మిలియన్ల ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు భారత రాజ్యాంగసభలోకి అడుగుపెట్టారు. ఆ తరువాత మరో ఐదు సంవత్సరాల పాటు హైదరాబాద్ ప్రత్యేకరాష్ట్రంగానే కొనసాగింది. భాషా ప్రయుక్తరాష్ట్రాల కోసం జరిగిన ఉద్యమం ఫలించడంతో హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది.

కులీ ఖుతుబ్‌షా

జనాభా ఇంతలోనే ఎంత పెరిగిందీ!

హైదరాబాద్‌లో మున్సిపల్ పాలన 1869 నుండే ప్రారంభమైంది. సిటీ పోలీస్ కమిషనర్‌ను కొత్వాల్‌గా పిల్చేవారు. ఆయన మున్సిపల్ వ్యవహారాలను సైతం చూసేవారు. ఆ ఏడాదే సర్ సాలర్‌జంగ్1 మున్సిపల్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేసి హైదరాబాద్, చాదర్‌ఘాట్ బోర్డులకు కమిషనర్‌ను నియమించారు. హైదరాబాద్ పట్టణ విస్తీర్ణం 55 చదరపుకిలోమీటర్లు. కేవలం 3.5 లక్షల మంది జనాభా ఉండేది. 1886లో చాదర్‌ఘాట్ మున్సిపాల్టీ అయింది. 1921లో హైదరాబాద్ మున్సిపాల్టీ పరిధిని 82 చదరపు కిలోమీటర్లకు విస్తరించారు. 1933లో హైదరాబాద్, చాదర్‌ఘాట్‌లను విలీనం చేసి మున్సిపల్ కార్పొరేషన్‌గా ప్రకటించారు. హైదరాబాద్ మున్సిపల్ చట్టం రూపొందింది. మొదటిసారిగా 1934లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిగాయి. 1937లో జూబ్లీహిల్స్ మున్సిపాల్టీలో బంజారాహిల్స్ తదితర ప్రాంతాలు విలీనమయ్యాయి. కొన్ని కారణాల వల్ల 1942లో హైదరాబాద్‌కు కార్పొరేషన్ హోదా రద్దయింది. 1945లో ఏర్పాటైన సికింద్రాబాద్ మున్సిపాల్టీ 1951లో కార్పొరేషన్ హోదా పొందింది. 1955లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సికింద్రాబాద్ కార్పొరేషన్, జూబ్లీహిల్స్ మున్సిపాల్టీలు విలీనమయ్యాయి. అప్పటినుండి 2007 వరకు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొనసాగింది. మున్సిపల్ వ్యవస్థ ప్రారంభమైన 1869లో హైదరాబాద్ పట్టణ జనాభా 3.5 లక్షలు కాగా, 2007లో గ్రేటర్ ఆవిర్భావం తరువాత 67 లక్షలకు చేరుకుంది. హైదరాబాదు నగరాన్ని నిర్మిస్తూ కులీ ఖుతుబ్‌షా ఈ నగరంలో జనాభా చేప పిల్లలుగా వేగంగా పెరగాలని అన్నారు. ఆయన కోరుకున్నది ఎంత జనాభానో కానీ నగరంలో జన సంఖ్య అవధులు దాటి పెరిగింది. ✶

కొన్ని ముఖ్య సంఘటనలు

1591	మూసీనది ఒడ్డున హైదరాబాద్ నగరం, చార్మినార్ నిర్మించిన మహమ్మద్ క్వాలీ ఖుతుబ్‌షా	1884	అధికారభాష హోదా నుండి పారసీ తొలగింపు. ఉర్దూకు గుర్తింపు
1687	గోల్కొండ కోట స్వాధీనం చేసుకొన్న ఔరంగజేబు	3.3.1884	ఫలక్‌నామా ప్యాలెస్ శంకుస్థాపన
1713	సుబేదార్‌గా నిజాంఉల్ ముల్క్ నియామకం	1884	డిజిపి నియామకం, జైళ్ల శాఖ ఏర్పాటు
1724	దక్కన్‌లో నిజాం ఆధిక్యత	4.12.1889	చార్మినార్‌పై గడియారాల బిగింపు
1750	సల్బాత్‌జంగ్‌చే చౌమహల్లా ప్యాలెస్ నిర్మాణం	20.8.1897	మలేరియాకు కారణమైన అనాఫిలిస్ దోమను గుర్తించిన సర్ రోనాల్డ్‌రోస్
1753	ఫ్రెంచ్‌వారికి ముస్తాఫానగర్, రాజమండ్రి, ఏలూరు. చిక్కోలు జిల్లాల అప్పగింత	28.9.1908	మూసీ వరద బీభత్సం
1756	ఆధిపత్యం కోసం బ్రిటిష్, ఫ్రెంచ్‌వారి మధ్య పోరు	1908	నిజామియా అబ్జర్వేటరీ ప్రారంభం
1759	ఫ్రెంచ్ ప్రాబల్యం అంతం	1908	హైదరాబాద్ విద్యుత్‌శాఖ ప్రారంభం
1779 ఏప్రిల్	మొట్టమొదటి బ్రిటిష్ ప్రతినిధిగా జాన్ హాలెండ్ నియామకం	1913	వ్యవసాయ శాఖ ప్రారంభం
		15.9.1915	హైకోర్టు భవన నిర్మాణ పనులు ప్రారంభం
25.3. 1798	ఫ్రెంచ్ జనరల్ మైఖెల్ రెమాండ్ మృతి, సరూర్‌నగర్‌లో ఖననం	1917	ఉస్మానియా యూనివర్శిటీ ప్రారంభం
		1920	ఉస్మాన్‌సాగర్(గండిపేట) నిర్మాణ పనులు పూర్తి
1798	టిప్పుసుల్తాన్‌కు వ్యతిరేకంగా బ్రిటిష్‌తో ఒప్పందం - హైదరాబాద్‌లో బ్రిటిష్ ప్రభావం ప్రారంభం	1923	జాగిర్‌దాస్ (హైదరాబాద్ పబ్లిక్ స్కూల్) కళాశాల నిర్మాణపనులు ప్రారంభం
25.7.1804	మీర్ ఆలం ట్యాంకు నిర్మాణపనులు ప్రారంభం	1924	నిజాంసాగర్ ప్రాజెక్టు పనులు ప్రారంభం-1931లో పూర్తి
1846	డాక్టర్ విలియమ్ మెక్‌లైన్ ప్రిన్సిపల్‌గా హైదరాబాద్ మెడికల్ స్కూల్ ప్రారంభం	1926	ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రారంభం
1854	సాలర్‌జంగ్1 చే దార్ -ఉల్ - ఉలూమ్ శంకుస్థాపన	1927	హిమాయత్‌సాగర్ నిర్మాణ పనులు పూర్తి
1867	ప్రభుత్వ కేంద్ర ముద్రణాకార్యలయం శంకుస్థాపన	1931	ఉస్మానియా యూనివర్శిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభం
1868	సర్ ఆస్మాన్‌జాచే బషీర్‌బాగ్ ప్యాలెస్ నిర్మాణ పనులు ప్రారంభం	1936	హైదరాబాద్ రాష్ట్ర ఏరోక్లబ్ బేగంపేటలో ప్రారంభం
1869	నిజాం రాష్ట్ర రైల్వే పనులు ప్రారంభం-మొదటి పోస్టల్ స్టాంపు విడుదల	13.9. 1948	పోలీస్‌యాక్షన్ ప్రారంభం
		17.9.1948	భారత్ యూనియన్‌లో హైదరాబాద్ విలీనం
8.10.1874	నిజాం రాష్ట్ర రైల్వే నిర్మాణ పనులు పూర్తి - జాతికి అంకితం	26.3.50	నిజాం ఏడవ పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు రాజ్‌ప్రముఖ్‌గా గుర్తింపు
18.11.1876	హైదరాబాద్ రాష్ట్రంలో సతి నిషేధం	24.2.1967	ఉస్మాన్ అలీఖాన్ మృతి
1879	మలక్‌పేటలో గుర్రపుపందాలు ప్రారంభం		

తెలుసా!

ఆరుగంటల పాలన

మొగలాయి చక్రవర్తులలో హుమాయున్ మిక్కిలి స్నేహపాత్రుడు. దేశంలో వివిధ ప్రాంతాలలో ఉన్న సామంత రాజులతో మంచి సంబంధాలు కలిగి వుండటమే కాకుండా తరచుగా వారిని రాజదర్బారుకు ఆహ్వానించి కావలసిన మర్యాదలు చేసేవాడు. ఒకసారి హుమాయున్ నదిలో పడిపోయాడు. అజ్మీర్ నవాబు నదిలో పడిన హుమాయున్‌ను రక్షించి బయటకు తీసుకువచ్చాడు. తన ప్రాణాలను కాపాడినందుకు ప్రతిగా అజ్మీర్ నవాబును ఆరు గంటలపాటు భారత చక్రవర్తిగా నియమించాడు హుమాయున్. అజ్మీర్ స్వల్పకాలికమైన తన పాలన జ్ఞాపకార్థం అప్పటికే అమలులో వున్న వెండి నాణేలను రద్దుచేశారు. వాటి స్థానే తోలు నాణేలను ప్రవేశపెట్టాల్సిందిగా ఆజ్ఞను జారీచేశాడు. హుమాయున్ కాలంలో 1555లో ఈ అద్భుత సంఘటన జరిగింది. భారతదేశ చరిత్రలోనే కాదు, ప్రపంచ చరిత్రలో కేవలం ఆరు గంటలపాటు అధికారంలో వున్న ఘనత అజ్మీర్ నవాబుకే దక్కింది.

గొడుగు వాడకానికి రాయల్టీ

క్రీస్తుపూర్వం 11వ శతాబ్దంలో చైనాలో మొదటిసారిగా గొడుగు వాడకం ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ప్రాచీన నగరాలైన ఈజిప్టు, బాబిలోనియాలలో గొడుగు వాడకానికి కొంత రాయల్టీ చెల్లించవలసి వుండేది. వర్షానికి రక్షణగా గొడుగు వాడడం మాత్రం యూరప్‌లో మొట్టమొదటిసారిగా ప్రాచీన రోమ్ సామ్రాజ్యంలో ప్రారంభమయ్యింది. మధ్యయుగాల్లో గొడుగు వాడకం హఠాత్తుగా ఆగిపోయింది. తిరిగి 1680 లో ఫ్రాన్స్‌లో ప్రారంభమైన గొడుగు వాడకం ఇంగ్లండ్‌కు వ్యాప్తి చెందింది.

చేపల పందేలు



థాయ్‌లాండ్‌లో పురాతన కాలం నుంచి "చేపల పందేలు" ఆచారం కొనసాగుతూనే వుంది. థాయ్‌లాండ్‌లో బూడిద రంగుగల మిక్కిలి చిన్నవిగావుండే ఒకరకపు చేపలకి పోట్లాట అంటే మహ ఇష్టం. అవి గాలిలో లభించే ఆక్సిజన్‌పైనే ఆధారపడి జీవిస్తుంటాయి. కనుక మాటి మాటికీ నీటి ఉపరితలానికి వచ్చి శ్వాసపీల్చుకుని మళ్ళీ నీటిలోకి వెళ్తుంటాయి. అందంగా తళుకు, బెళుకుగా పోరాడే స్వభావంగల ఈ చేపల్ని థాయిలాండ్ ప్రజలు వేటాడి తమ ఇళ్ళలో శ్రద్ధగా పెంచుతారు. పిల్లలు, వృద్ధులుకూడా వీటితో పందెం కాస్తారు. ఇక యువకుల సంగతి వేరే చెప్పనవసరంలేదు. ఎక్కడ, ఏరోజు ఎన్నిగంటలకు ఈ చేపల పందేలు జరుగుతాయో ముందుగానే నిర్ణయించబడుతుంది. మొదట పందెం కాసేవారు నీటితో నింపిన గిన్నెలాంటి చిన్న పాత్రలలో తమ చేపల్ని వదులుతారు. ఒక దానినొకటి చూస్తూ తమ బలాలను అంచనా వేసుకుంటాయి. ఇక మొదలవుతుంది పోరాటం. ఈ పోరాటంలో వాటి పొలుసులు ఎగిరిపోతాయి. రెక్కలు చిరిగిపోతాయి. శరీరమంతా రక్తసిక్తమైపోతుంది. అయినా బతికే ఉంటాయి. వాటి గాయాలు త్వరగానే మానిపోతాయి. రెండు, మూడు వారాల్లో మళ్ళీ రెక్కలు, పొలుసులు వస్తాయి. ఆరోగ్యం చేకూరగానే మళ్ళీ అవి పోరాటానికి కాలు దువ్వుతాయి. పోరాట సమయంలో ఈ చేపలు ఒకదాని పెదవి మరొకటి గట్టిగా అదిమి పట్టుకొని అనేకసార్లు చక్కర్లు కొడుతూ అలా నీటి అడుగు భాగాన కూర్చుంటాయి. పోరాట సమయంలో వాటికి ఆక్సిజన్ అవసరమైతే సంకేతం ద్వారా తెలియజెప్పి పైకి వస్తాయి. అలా పోరాడి బాగా అలసిపోయిన చేప పారిపోయాక మూల ఒదిగిపోతుంది.

ఉల్లిపాయలు ఏడ్పు తెప్పిస్తాయెందుకు?



అసలు మనం రోజంతా ఏడుస్తూ వుంటామనే విషయం ఎంతమందికి తెలుసు. కంటిబాహ్య పొరలమూలలో కన్నీటి గ్రంధి వుంటుంది. మనం కనురెప్పలు మూసినప్పుడల్లా ఆగ్రంధి స్రవించడం ప్రారంభిస్తుంది. ఈ రకంగా మనకు తెలియకుండా కనురెప్ప మూసినప్పుడల్లా కన్నీటి గ్రంధి స్రవించి కార్నియాను శుభ్రంచేస్తుంది. అదేవిధంగా మంట కలిగించే పదార్థాలు కార్నియాను రక్షించేందుకు కూడా కనురెప్పలు అసంకల్పితంగా మూసుకుపోతాయి. ఉల్లిపాయలలో వుండే తైలంలో గంధకం వుంటుంది. దాని కారణంగా కళ్ళు మండడం ప్రారంభమవుతాయి. దీని నుండి రక్షణగా కనురెప్పలు ఎక్కువసార్లు మూసుకుంటాయి. దానితో కన్నీటిగ్రంధి అధికంగా స్రవించి కార్నియాను శుభ్రపరుస్తుంది. ★

కవిత్వమ్

సాధింపుల 'సహకారం' వెనుక

- పోతగాని

నమ్మకాల నల్లమబ్బులు కరిగి
వెలుగు వానలు కురిసేదాక
చుక్కల్లో దూరిన చూపుల రెక్కలు తెగి
ఊహలు ఉనికి దాల్చేదాక
కుమ్మరించే ప్రేమల్లో కుతంత్రమెంతో
అమాయకంగా అనుభవించే
ఈ చెమట పువ్వుల మట్టి పరిమళాలకేం తెలుసు?!
విధేయత నటించే వీరావేశాలు
అదృశ్య వల్మీకాలనుండి
పడగ విప్పిన తెల్లత్రాచులై
వడ్డించిన ఆశల మెతుకుల్లోకి
కాలకూటాన్ని విరజిమ్ముతుంటాయి!
సహకార మంత్రాన్ని జపించి
స్వాహా జలాన్ని చల్లే నయవంచక సన్నివేశాలు
ఇక అడుగడుగునా దర్శనమిస్తుంటాయి!
కుటిలనీతి కుట్రించిన
కార్పొరేటు సాలెగూటిలోకి
నిర్బంధంగా నెట్టివేయబడుతున్న "సాగు" జీవుల
నీడల్ని సైతం వీడని ఇదొక విపత్కర సందర్భం!
తరతరాలుగా బురద మట్టిని
బువ్వగా పండించిన నేలలో
మోకాళ్లదాకా పాతుకున్న కాళ్లు
అర్థాంతరంగా పెకిలించబడుతుంటాయి!
పొలాల పేగుమళ్లలో
భాగ్యరాశులై మెరిసిన స్వేదం
అనూహ్య పరిణామాలకు ఆదరణ కోల్పోయి
చీకటిలో ఒలికిపోయిన ఓదార్పును
ఓపిగ్గా కూడదీసుకుంటుంది
అసమగ్ర యోచనలన్నీ
ఆచరణలై ముసురుకుంటున్నప్పుడు
సాగిపోయే సాగుకు కమతాలే సాకులుగా
అవరోధాలు అవతరిస్తున్నప్పుడు
ఊహల్లోనే ఉత్పత్తులు ఊరేగుతుంటాయి!
స్వార్థానికి సేద్యం బలౌతున్నచోట
సుతిమెత్తని అంక్షలతో మట్టి పేగు బంధం మాయమౌతున్నచోట
"సహకారం" గోకినా చేపని గొడ్డుటావై గోసపెడుతుంటుంది!
మమకారాన్ని రంగరించి మట్టి పిసికిన తాతలనాటి మాగాణంలో
ప్రకాశించే పసిడి కాంతులకు మైమరచి
మృదు స్పర్శకై చాచిన చేతిని దోషిగా నిలబెడుతుంది!!
అన్యాయాన్ని ఆమోదించని గొంతుకల్లో
నినాదాలై ఎగిసిన కంఠాలపై
నిర్దాక్షిణ్యంగా నియంతృత్వ చురకత్తుల్ని వేలాడగడుతుంది!! ★

ప్రగతి?

ఎస్. వేణుగోపాల్

తీవ్రవాదం తీవ్రరూపం దాల్చింది
అహింసావాదం అంధకారంలో మునిగింది
దండకారణ్యంలో
ధీమాగా బ్రతికేయొచ్చేమోగానీ
జనారణ్యంలో మాత్రం
దిన దిన గండమే!
ఏ బస్టాండో! ఏ సినిమాహాల్లో!
ఏ టిఫిన్ సెంటరో! ఏ పార్కో!
ఏ పొద మాటున నక్కివుందో
బాంబు పంజా!
ఏ పుట్టలో దాగి ఉందో
కాలకూట విషసర్పం!
ఏ క్షణం ఎక్కడికి వెళ్ళాలో
ఆ కాల యముడికి కూడా
ముందుగా తెలిసిచావదేమో!
ఆలయంలోకి అడుగుపెట్టినా
ప్రాణం అరచేతిలో పెట్టుకోవలసిందే!
మారణహోమంలో పడి
మానవత్వం మాడిపోతుంది
రక్తం రాజధానితో
హోళీ ఆడుతోంది
అమాయకుల ఆర్తనాదాలతో
నగరం అట్టుడికి పోతోంది
మానవ మేధస్సు
మరణంవైపే పరుగెడుతోంది!
మనిషి శ్రేయస్సు
పాతాళంలోకి కుంగిపోతోంది!
ఇదేనా ప్రపంచ ప్రగతి!
ఇంతేనా మనిషి అభివృద్ధి? ★

కంపెనీ మూస్తే అంతేనా!

నేను పనిచేస్తున్న కంపెనీలో 25 మంది ఉన్నారు. కంపెనీ లాస్‌లో ఉందని మూసేశారు. దాంతో మా బతుకులు రోడ్డున పడ్డాయి. మేం ఏం చేయాలి? మాకు డబ్బులు, జీతాలు ఇవ్వకుండానే కంపెనీ మూసేశారు. మాకు సలహా ఇవ్వగలరు.

రమేష్, కాజీపేట.

మీరు రిట్రెచ్‌మెంట్ గావించబడితే లేబర్‌కోర్టుకెళ్లి మీకు రావలసిన సర్వీస్ కాంపన్‌సేషన్ మొత్తం వసూలు చేసుకోవచ్చు. అంతే కాకుండా లేబర్ ఆఫీసర్ వద్ద కేసు ఫైలు చేస్తే గ్రాడ్యుటీ మొత్తం వసూలు చేసుకోవచ్చు. మీరు పని చేసిన సంవత్సరాలను బట్టి అమౌంట్ వస్తుంది.

జి ఎల్ నరసింహారావు,
అడ్వకేట్,
3-4-778 నుండి 780/1,
బి-002, ప్రసాద్ ఎన్‌క్లేవ్,
బర్కత్‌పురా రోడ్,
హైదరాబాద్

చెక్ బౌన్స్ అయితే...

మాకు రావలసిన డబ్బుకు గాను చెక్కు బౌన్సు చేసినందుకు ఒకతనిపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాం. దానికి వడ్డీతో సహా కలిపి తిరిగి మరొక చెక్ మరునటి రోజు డబ్బులు తీసుకోవచ్చని చెప్పి ఇచ్చాడు. అతనిని నమ్మి కేసు క్లోజ్ చేశాం. రెండోసారి ఇచ్చిన చెక్కు కూడా బౌన్స్ అయింది. ఇప్పుడు మేం ఏం చేయాలి?

రామారావు, నిజామాబాద్.

ఒక సారి చెక్ బౌన్స్ అయినప్పుడు మీరు రెండవసారి చెక్కు కాకుండా డి.డి లాంటివి తీసుకుని కేసు విత్‌డ్రా చేసుకుంటే బాగుండేది. మరోసారి కోర్టుకెళ్లే సమయం కలిసొచ్చేది. కోర్టుకెళ్లి మరోసారి కేసు వేయడమే తప్ప దీనికి ఇంకోమార్గం లేదు. గతంలో చేసినట్టే కేసు ఫైల్ చేయండి.

చేపలు మేం వేస్తే... పట్టుకునేది వాళ్లా!

మాకు సంబంధించి ఊళ్లో రెండు చేపల చెరువులున్నాయి. వాటిని మూడు సంఘాలవారు పోటీపై పాడుకుంటారు.అది గతంలో మైనర్ ఇరిగేషన్‌గా ఉండేది. ఇప్పుడు మేజర్ ఇరిగేషన్‌గా గుర్తించి ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌వారు వేలం వేస్తున్నారు. మేం చేపలు వేశాక మమ్మల్ని పట్టుకోనివ్వకుండా హైకోర్టువారి వద్ద వేరే సంఘం వాళ్లు ఉత్తర్వులు పొందారు. మా గడువు జూన్ 30తో ముగిసింది. మేం దాన్లో లక్షల రూపాయలు పోసి చేపలు పెంచాం. మాకు అదే జీవనాధార వృత్తి. మిగతా సంఘాలది ఆ పరిస్థితి కాదు. సమయానుకూలంగా ఇతర పనులు చేస్తుంటారు. 1,2 గడువులలోపు పట్టుకోనివ్వలేదు. కావున మేం నష్టపోవలసిందేనా. దయచేసి సలహా ఇవ్వగలరు.

రవీంద్ర, హైదరాబాద్.

వేలంలో మీరు పొందినట్లయితే వేలంలో పాట పాడుకున్నంత వరకు డబ్బులు చెల్లించి మీరు చేపలు వేసి వుంటారు. కావున మీ చేపలు మీరు పట్టుకోవచ్చు. గడువు లోపల పట్టుకోకుండా హైకోర్టువారు స్టే విధించారు. కావున మీరు చేపలు పట్టుకోలేకపోతే మీరు హైకోర్టునందు అట్టి స్టేకు వెకేట్ చేయించి చేపలు పట్టుకోవడానికి వేలంలో ప్రకటన డేటు అయిపోయింది కావున ఇంకో పదిరోజులు చేపలు పట్టుకోవడానికి అనుమతి పొందవచ్చు. మీ ప్రత్యర్థులు హైకోర్టు నందు ఎందుకు స్టే పొందారో కారణం రాసి ఉంటే వివరణ చెప్పేవాడిని. మీరు నష్టపోకుండా ఉత్తర్వులు పొందవచ్చు.

అనుమతి లేకుండా కట్టేస్తున్నారు

మేము అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తీసుకుని ఉంటున్నాము. మేము వుంటున్నది గ్రౌండ్ ఫ్లోర్‌లో. ఆ అపార్ట్‌మెంట్‌లో మూడు ఫ్లోర్లు ఉన్నాయి. ప్రస్తుతం నాల్గవ ఫ్లోర్ అనుమతి లేకుండానే కడుతున్నారు. ప్రస్తుతం నాల్గవ ఫ్లోర్ కడుతుంటే పాత పిల్లర్లపై అదనపు భారం పడుతుంది కదా. మా అపార్ట్‌మెంటు వారు పట్టించుకోవడం లేదు. ఎం.సి.హెచ్ అధికారులను లోబర్చుకుని కడుతున్నారు. మేం ఏం చేయాలి. ఆపలేమా?

సంధ్యవి, హైదరాబాద్.

మీరు ఎం.సి.హెచ్ అధికారులకు ధరఖాస్తు చేసుకోండి. అక్రమ కట్టడం అని వారికి తెలియచేస్తే వారే వచ్చి కూలగొడ్తారు. వారు కూలగొట్టనట్లయితే అదే విషయం మీద హైకోర్టునందు రిట్ వేసి కూలగొట్టించవచ్చు. కేసులో పాత పిల్లర్లపై కట్టడం భారం పడుతుందనే విషయం స్పష్టంగా చెప్పాల్సి వుంటుంది.

బోనస్ ఇవ్వరే!

కంపెనీ నష్టాల్లో నడుస్తుందని బోనస్ ఇవ్వకుండా 10సంవత్సరాల నుండి నెట్టుకొస్తున్నారు. బోసన్ ఇవ్వమంటే వేధిస్తున్నారు. నష్టాల్లో వుంటే బోనస్ ఇవ్వవలసిన పనిలేదా? లాభాలుంటే బోనస్ ఇస్తారా? ఎంత బోనస్ ఇవ్వాల్సుంటుంది? వివరాలు తెలియగోరుతున్నాం.

రాజేందర్, హైదరాబాద్.

బోనస్ అనేది లాభాల్లో భాగస్వామ్యం కల్పించడం వంటిది. జీతం మాత్రమే కాకుండా అదనంగా ఇవ్వవలసి ఉంటుంది. కంపెనీ నష్టాల్లో వుందనే సాకు ప్రతి వ్యాపారి చూపిస్తూనే వుంటాడు. అది అన్ని సార్లు సరైంది కాదు. తక్కువలో తక్కువ తను చివరిసారి జీతం ఎత్తిన సంవత్సరం వేతనంలో 8.33శాతం బోనస్‌గా చెల్లించాల్సి వుంటుంది.లాభాల్లో వుంటే 20 శాతం వరకు చెల్లించాల్సి వుంటుంది. లేబర్ కోర్టులో బోనస్ కోసం ఫైలు చేసుకోవచ్చు.

★

నవ్వుల్ - పువ్వుల్

నాన్న వల్ల

టీచర్ : రామూ! క్లాసుకు ఆలస్యంగా వచ్చావేంటి?
రాము : మా నాన్నగారు నా హోంవర్క్ చేయడం ఆలస్యమైంది టీచర్.

❊ ❊ ❊

రివర్స్

టీచర్ : 5+7 ఎంత?
వెంగళప్ప : 12 టీచర్.
టీచర్ : వెరీగుడ్, 7+5 ఎంత?
వెంగళప్ప : 21. నాకు తెలీదనుకోకండి, మీరు రివర్స్‌లో అడిగారు కదూ!

❊ ❊ ❊

పూలకొట్టు పనివాడు



చంద్రం : పూలకొట్లో పనిచేసేవాడిని తెచ్చి పచారీకొట్లో పెట్టుకోవడం తప్పయిపోయిందిరా.
రాజు : ఏం .. ఏం చేశాడేం?
చంద్రం : ఆరారా పూలమీద చల్లినట్టే పచారీ సరుకుల మీద కూడా నీళ్లు చల్లుతున్నాడు.

❊ ❊ ❊

అంత్యక్రియలు

రామన్న : అదేంట్రా, మొన్న ఆ పక్క వీధిలో ఆయన అంత్యక్రియలకు రాలేదెందుకు? బాగా తెలిసినవాడేగా.
వెంకన్న : వచ్చి ఏం లాభంరా, రేపు నా అంత్యక్రియలకు ఆయనొస్తాడా ఏంటి? అందుకే నేనూ రాలేదు.

చేపలు

(పిచ్చాసుపత్రి కాంపౌండు లోపల పూల మొక్కల్లో గాలమేసి ఒక పిచ్చివాడు కూర్చున్నాడు)

అటువైపు వచ్చిన డాక్టర్ సరదాగా 'ఏమయ్యా! పొద్దుట్నుంచి గాలమేసి కూర్చున్నావు కదా, ఎన్ని చేపల్ని పట్టుకున్నావ్?' అనడిగాడు.
'నీతో కలిపి తొమ్మిది' డాక్టర్‌ని చూసి అన్నాడు పిచ్చివాడు.

❊ ❊ ❊

గడ్డికూర

సుకుమారి : వదినా! అన్నయ్యగారు కాయగూరలు ఏమైనా తీసుకొచ్చారా?
కమల : ఊహూ! ఏమీ తీసుకురాలేదు. పచ్చిగడ్డి కిలో, ఎండుగడ్డి కిలో తెచ్చారు. పచ్చిగడ్డితో పచ్చడి చేసి ఎండుగడ్డి పులుసు పెట్టమన్నారు.
సుకుమారి : అదేమిటి?!
కమల : కాయగూరల ధరలు కొనడానికి అందుబాటులో లేవట మరి.

❊ ❊ ❊

మతిమరుపు

భార్య : డాక్టర్ గారి దగ్గరకు వెళ్లి చూపించుకున్నారు కదా? మీ మతిమరుపు తగ్గుతుందన్నారా?
భర్త : తగ్గుతుందన్నారు. మందులు రాసిచ్చారు. అయ్యో! మందుల చీటీ బదులు ఆయన టేబిల్ మీదున్న డైరీ తీసుకొచ్చేశాను.

❊ ❊ ❊

ఆఫ్ టికెట్



కండక్టర్ : పన్నెండేళ్లలోపు వాళ్లకు ఆఫ్ టికెట్. నీ వయసెంత బాబూ?
బాబు : పదకొండు.
కండక్టర్ : నీకు పన్నెండేళ్లెప్పుడొస్తాయి?
బాబు : బస్సు దిగాక.



చాక్లెట్

కాలవసిన పదార్థాలు

పాలు - 1కప్పు

పెరుగు - 1కప్పు

పంచదార - 1కప్పు

యాలకులు - 2

తయారుచేయు విధానం

కాచిన పాలు, పెరుగు, పంచదార మూడింటిని ఒక గిన్నెలో కలిపి స్టౌమీద పెట్టి ఈ మిశ్రమం దగ్గరగా వచ్చేవరకు కలుపుతూ ఉండాలి. ఉడికిన కొద్దీ చాక్లెట్ రంగు వస్తుంది. దగ్గరగా వచ్చిన తర్వాత దింపే ముందు యాలకుల పొడి వేసి బాగా కలిపి ఒక ప్లేట్‌కి నెయ్యిరాసి దాన్లో ఈ మిశ్రమాన్ని పోసి సమానంగా వచ్చేలా చేసి ఆరనివ్వాలి. ఆరిన తర్వాత చాకుతో ముక్కలు కోసుకోవాలి.

ఎప్పుడూ చాక్లెట్లు షాపుల్లో కొనుక్కోవడమేనా! ఇలా ఇంట్లో తయారు చేసిన చాక్లెట్ రుచి కూడా మీ చిన్నారులకు చూపించండి మరి.



కాప్సికమ్ మసాలా కూర

కావలసిన పదార్థాలు

కాప్సికమ్ - పావుకిలో

నువ్వులు - 4టేబుల్ స్పూన్లు

పెద్ద ఉల్లిపాయలు - 2 పెద్దవి

కొబ్బరి - అరచిప్ప, జీలకర్ర - 1టీస్పూను

చింతపండు - పెద్ద నిమ్మకాయంత

అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1టీస్పూను

గసగసాలు - 1టీ స్పూను, ఉప్పు కారం - తగినంత

తయారు చేయు విధానం

ముందుగా ఉల్లిపాయ ముక్కల్ని కొద్దిగా నూనెలో వేయించి పేస్ట్ చేసుకోవాలి. కొబ్బరి, గసగసాలు, జీలకర్ర, నువ్వులు వేయించి పొడి చేసుకోవాలి. ఇందులో ఉల్లిపాయ పేస్ట్ కలపాలి. ఈ మిశ్రమంలో తగినంత ఉప్పు, కారం, అల్లం, వెల్లుల్లి పేస్ట్ కలిపి మిక్సీలో వేసుకోవాలి. కాప్సికమ్‌ని 4 భాగాలుగా (పూర్తిగా కోయకూడదు) చేసి నూనెలో కొద్దిగా వేయించాలి. పైన తయారు చేసి పెట్టుకున్న పేస్ట్‌ను వేయించిన కాప్సికమ్‌లో వేసి కలపాలి. ఇందులో చింతపండు రసం పోసి మగ్గనివ్వాలి. దింపేముందు సన్నగా తరిగిన కొత్తిమీరను చల్లుకుంటే చాలు. ఆ టేస్టే వేరు.



- సాబెరా భాను

ఆలూటమాటా కూర

కావలసిన పదార్థాలు

ఆలుగడ్డలు - అరకిలో, టమాటా - పావుకిలో

ఉల్లిగడ్డలు - 2 పెద్దవి

పచ్చిమిర్చి - 4

అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్

ఉప్పు, కారం - తగినంత

పసుపు - చిటికెడు, కొత్తిమీర - 1కట్ట

చిన్న మెంతికూర - చిన్నకట్ట

కరివేపాకు - 2 రెబ్బలు, మసాలా పొడి - 1టీస్పూను

నూనె - కొద్దిగా

తయారుచేయు విధానం

స్టౌ మీద గిన్నె పెట్టి అందులో 2 టీస్పూన్ల నూనె వేసి కాగనివ్వాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి మెత్తగా అయ్యే వరకు వేయించాలి. అందులోనే ఆలుగడ్డ ముక్కలు వేసి 2 నిమిషాలు వేయించాలి. తర్వాత ఉప్పు, కారం, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలిపి కాసేపు మగ్గనివ్వాలి. ఆ తర్వాత టమాటా ముక్కలు వేసి కలిపి అవి ఉడికేవరకు ఉంచాలి. చివరిలో కొంచెం నీళ్లు కలిపి 5నిమిషాల తర్వాత దింపేయొచ్చు. అయితే దింపేముందు మసాలా పొడి కలుపుకోవాలి. చాలా బావుంటుంది మరి. ప్రయత్నించి చూడండి.

సొరకాయ హల్వా

కావలసిన పదార్థాలు

సొరకాయ - 1

పంచదార - అరకేజీ

నెయ్యి - 100 గ్రాములు

పాలు - 2కప్పులు

యాలకులు - 5

జీడిపప్పు - 10

కిస్‌మిస్ - కొద్దిగా

బాదంపప్పు - 10

తయారు చేయు విధానం

సొరకాయ పైచెక్కు తీసి తురుముకోవాలి. దీనిని ఒక గిన్నెలో వేసి అందులోని నీరు ఇంకిపోయే వరకు ఉడకపెట్టాలి. నీరంతా ఇంకిపోయిన తర్వాత అందులో నెయ్యి వేసి వేయించాలి. వేడి చేసిన పాలలో పంచదార వేసి మరికొంచెం సేపు కాగనివ్వాలి. తర్వాత వేయించుకున్న సొరకాయ తురుము వేయాలి. అందులోనే యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్, బాదం పప్పు వేసి కలియదిప్పితే సరి. ఈ స్వీట్ వేడిగా ఉన్నా, చల్లగా ఉన్నా రుచిగా ఉంటుంది.



కథ

దుప్పటి దొంగ



- ఊళ్ళ విశ్వనాథ స్వామి

తనపై పడిన నీలాపనింద ఎలా పోతుందా అని ఆలోచిస్తూ రోడ్లపై తిరుగుతున్నాడు రాము.

ఒకరోజు చాకలి వీధి వెంబడి పోతుంటే చాకలి సుబ్బయ్య ఇంటి ముందు మెరుస్తున్న కాశ్మీరు దుప్పటి కనిపించింది.

మళ్ళీ వాడిని అడిగితే ఏమను కొంటాడోనని మౌనం వహించాడు. తనను సందేహిస్తున్న సీతారామయ్యగారి దంపతులకు తన నిజాయితీ ఎలా తెలుపుకోవాలో తెలియడం లేదు. వాడి దగ్గరకు వెళ్ళి అడగాలనుకున్న విషయం అడగడం మర్చిపోయాడు. ఆ ఊరు రచ్చబండ దగ్గర, చెరువు దగ్గర, పొలాల దగ్గర ఎక్కడ చూసినా సీతారామయ్యగారి దుప్పటి విషయాలు ఊరందరి కచేరీల్లో కదలాడుతున్నాయి.

అలా పదిరోజులు గడిచాయి. ఆ రోజు రాము వేగంగా లేచి పొలంలో వరి నారు వేయించాలని బయలు దేరాడు.

అంతలో అతని వెనుక "రాము గారూ" అన్న కేక వినిపించింది. వెనక్కు తిరిగి చూస్తే మంగలి కృష్ణుడు కనిపించాడు. ఆ రోజు అతను బాగా తాగి ఉన్నాడు.

మనిషి నీరసంగా ఉన్నాడు. కళ్ళు ఎర్రగా అగ్నిగోళాల్లా మండిపోతున్నాయి.

"బాబూ నన్ను క్షమించాలి" అని రాము కాళ్ళు పట్టుకున్నాడు.

"ఏంటీ కృష్ణా" అన్నాడతను.

"మీరు నన్ను క్షమించానంటే చెపుతాను సార్.

వెన్నెల పిండారబోసినట్లు ఆ వీధి అంతా ఆవరించి ఉంది. అది ఆ ఊరికి చివరి వీధి.

ఆ వీధి పక్కనే ఒక మామిడి తోపు ఉంది. అందులో ఉన్న చెట్లపై మామిడి పూలు తెల్లగా ముగ్గు వేసినట్లు మెరుస్తున్నాయి.

ఆ తోట నానుకొని ఓ తెల్లని మేడ ఈ మధ్యనే కట్టారు. వెన్నెలకు ఆ ఇంటి పైభాగంలో ఉన్న గదికి వేసిన పెయింటు మెరిసిపోతోంది.

ఆ ఇంటి ముందున్న ఆవరణలో పట్టెమంచంపై పడుకొని సీతారామయ్య హాయిగా ఆకాశంపై ఉన్న నక్షత్రాలను లెక్కపెడుతున్నాడు.

ఆ వీధిలో ఆయనదే కొత్త మేడ. మిగతావి పూరి ఇళ్ళు. రెండు, మూడు మిద్దిళ్లూ ఉన్నాయి. ఆయన పిల్లలలో ఒకరు హైదరాబాదులో కంప్యూటర్ ఇంజనీరు. మరొకతను ప్రైవేటు కంపెనీలో మేనేజరు. ఉన్న ఒక్కగానొక్క కూతుర్ని ఈ మధ్యనే పెండ్లి చేసి అత్తవారింటికి పంపించేశారు.

ఇకపోతే ఆ ఇంట్లో ఉండేది. సీతారామయ్యగారు, ఆయన భార్య మాత్రమే. ఆయనకు ఉన్న పది ఎకరాల పొలంలో ఎన్నో రకాల పంటలు పండిస్తారు. అలా పండించడంలో ఎంతో హాయి ఉందని అంటారు.

వ్యవసాయం చేసుకొని ఆయన ఒక్కడే ఊరిలో ఉండిపోయాడు. స్వంత ఊరిని, చిననాటి స్నేహితులను విడిచిపెట్టలేక అక్కడే ఉండిపోయాడు. దూరంగా ఉన్న కొడుకుల దగ్గరకు వెళ్ళకుండా అలానే గడుపుతాడు. అతని మంచం పక్కనే అతని ఇద్దరు నౌకర్లు నులకమంచాలపై పడుకున్నారు. వాళ్ళల్లో ఒకరి పేరు సోములు. ఇంకొకరి పేరు రాములు.

అప్పుడు రాత్రి తొమ్మిది గంటలయ్యింది. ఆయన చేతిలో ఉన్న రేడియో నుండి తెలుగు వార్తలు వస్తున్నాయి. అవి పూర్తయ్యే వరకు రోజూ వింటూ కూర్చుంటాడు. చల్లని గాలి వీస్తుంటే రేడియో సౌండు తగ్గించాడు సీతారామయ్య. మర్నాడే పౌర్ణమి కాబట్టి వెన్నెల బాగా విరబూసింది.

"ఏంటి సీతారామయ్య బావా! ఇంకా వేసవి రాలేదు. బైట పడుకున్నావు" అని రోడ్డుపై వెళ్తున్న రాము అడిగాడు. రాముకి సుమారు యాభై సంవత్సరాల వయస్సు ఉంటుంది. తెల్లని పండు జుట్టు. సన్నని పంచె, దానిపై తెల్లని ఖద్దరు షర్టు మెరుస్తున్నాయి. రోజూ అదే సమయానికి ఆ వీధి చివరలో ఉన్న కిళ్ళీకొట్టులో కిళ్లీ నమలడానికి వెళ్ళి వస్తుంటాడు. ఇద్దరూ ఒకే వయస్సు వారు. పైగా దూరపు బంధువులు కూడా. చిన్నప్పటి నుండి ఒకే ఊరిలో ఒకే స్కూలులో చదువుకున్నారు.

"బావా" అని ఒకరినొకరు పిలుచుకుంటారు.

"ఆ... మాఘమాసం కదా! వెన్నెలలో ఒక గంట పడుకుందామని" అన్నాడు సీతారామయ్య.

"వెన్నెలంటే మీకిష్టంలా ఉంది" అన్నాడు రాము.

"ఏం...మా చెల్లెమ్మను ఇంట్లో విడిచి ఒక్కడివే ఉన్నావేం? మంచు పడుతుంది జాగ్రత్త" అన్నాడతను.

"మా రెండో అబ్బాయి కాశ్మీరు నుంచి మంచి శాలువా తెచ్చాడు. మంచుకి భయపడను నేను!" అన్నాడు అతను.

"అయితే నేనా శాలువాను పట్టుకుపోతాను. అంత ఖరీదైన దుప్పటి కప్పుకొని రోడ్డుపైన పడుకుంటే ఎవరైనా దొంగిలించేస్తారు" అన్నాడు రాము నవ్వుకుంటూ.

"ఆ" అలాగే పోతే పోయిందిలే" అని రేడియో ఆపుచేసి ముసుగు తన్ని పడుకున్నాడు సీతారామయ్య.

అతని ఇద్దరు నౌకర్లు వారి మాటలు విని చిన్నగా నవ్వుకున్నారు. అలా వారిద్దరూ రోజూ ఏదో

హాస్యాలాడుకోవడం ఊరందరికీ తెలిసిన విషయమే.

రోజూ ఇద్దరూ కలిసి పంట చేలంట వెళ్ళడం ఒకరి కష్టాలలో ఇంకొకరు పాలు పంచుకొని ఒకరినొకరు ఆదుకోవడం అందరికి తెలిసిందే.

ఇద్దరూ స్వంత బావమర్దులు కాకపోయినా, స్వంత బావమర్దులు లాగా పలకరించుకోవడం, నవ్వుకోవడం, పరిహాసాలాడడం చేస్తారు. అందుకే వారి మాటలను విన్నవారు పెద్దగా పట్టించుకోరు.

"వస్తాను బావ" అంటు నోట్లో ఉన్న కిల్లీ నములుకుంటూ వెళ్ళిపోయాడు" రాము.

అతని వైపే చూస్తూ ఉండిపోయాడు సీతారామయ్య. తను వెళ్ళిన అరగంటకు సీతారామయ్య గారికి నిద్రపట్టింది. ఇంట్లో ఉన్నగదిలో ఆయన భార్య పడుకుంటే ఈయన తల దగ్గర రేడియో, బ్యాటరీ లైటు పెట్టుకొని బయట పడుకున్నాడు.

తెల్లవారింది. కానీ ఇంకా సూర్యోదయం కాలేదు. పక్కనున్న పశువుల శాలనుండి కోడి "కొక్కొరొకో" అని అరుస్తుంటే సీతారామయ్య లేచాడు.

అతను కళ్ళు విప్పి ముందు ఎదురుగా ఉన్న పశువులశాలలో ఆవులలో ఏదో ఒకదానిని చూస్తాడు. తరువాత తూర్పుకు తిరిగి సూర్యనమస్కారములు చేస్తాడు. సూర్యోదయం కాలేదు. ఒకసారి లేచి కూర్చున్నాడు. కాళ్ళ దగ్గర ఉన్న కాశ్మీరం శాలువా కన్పించలేదు. మంచం కింద, మంచంపైన చుట్టూ చూశాడు. ఐనా ఏమీ కన్పించలేదు...

అప్పటికే అతని నౌకర్లిద్దరూ లేచి పశువులకు దాణా వేస్తున్నారు. దూరంగా, రోడ్డుమీద కొందరు రైతులు పశువులను తోలుకుంటూ ఊరి చివరనున్న పొలాలకు వెళ్తున్నారు.

"ఒరే సోములూ! నా దుప్పటి కన్పించలేదు" అని కేకవేశాడు సీతారామయ్య.

ఆ కేక విని ఇద్దరు పాలేర్లూ పరుగెత్తుకుంటూ వచ్చారు. "ఏంది బాబు! రాత్రంతా మీ ఒంటిమీద శాలువ ఉండేది కదా! చూడండి సరిగ్గా ఎక్కడన్నా వుందేమో!" అంటూ చుట్టూ చూశారు వాళ్లిద్దరూ. అయినా వారికి కనిపించలేదు. అంతలో ఇంట్లో నుండి అన్నపూర్ణమ్మ నవ్వుకుంటూ వచ్చింది.

విషయం తెలుసుకొని ఆవిడ కూడా చుట్టు పక్కల వెతికింది. అయినా కన్పించలేదా దుప్పటి.

"కొత్త దుప్పటండి. రెండు వేల ఖరీదైనదని బాబు చెప్పాడు. ఇంకా సంవత్సరం కాలేదు. దాన్ని కాశ్మీరు నుండి తెచ్చి. అంత ఒళ్ళుమర్చి పడుకున్నారేంటి మీరు" అన్నదావిడగారు.

ఆమె అప్పుడే లేచింది. కాబోలు? జుత్తు అంతా చెదరి ఉంది. రాత్రి కట్టుకున్న లేత చీర బాగా నలిగి ఉంది. అయినా ముఖం మాత్రం తేజోవంతంగా మెరుస్తుంది. ముఖంపై రూపాయంత బొట్టు చెదరలేదు. సీతారామయ్యకు మనస్సు అదోలా ఉంది. "ఆ! ఎవరు తీస్తారు బాబా? మీ బావ పరిహాసాలాడాడు. బహుశ అతనే తీసి ఉంటాడు" అన్నాడు పెద్దపాలేరు.

"ఔనురా! రాత్రి అలా మాట్లాడినప్పుడే నేను అనుకున్నాను" అని సీతారామయ్య జేబు నుండి చుట్ట తీసి ముట్టించాడు.

"ఆయనకెందుకులే ఆ వాడిన దుప్పటి" అని చిన్న పాలేరు అన్నాడు.

"ఏమో! హాస్యానికి తీయొచ్చుకదా!" అందామె. అప్పుడు సీతారామయ్య చిన్నగా నవ్వుకున్నాడు. రెండు సంవత్సరాల క్రితం పొలంలో వరి చేను మేసిందని వారి మేకపిల్లను, రెండు రోజులు వారి ఇంట్లో దాచాడు. తరువాత వాళ్ళ ఇంటికి తీసుకువచ్చాడు. అలా ఇప్పుడు కూడా చేసి ఉండొచ్చు కదా!" అని అనుకున్నాడు. వెంటనే వాళ్ళ ఇంటికి బయలుదేరబోయాడు.

"ఉండండి! టీ తాగివెళ్దరుగాని" అని ఆమె అంటే,

"వద్దు! తొందరగా వచ్చేస్తాను" అన్నాడు.

అతని ముఖం చూస్తుంటే అప్పుడే లేచాడనిపిస్తుంది.

అంత ఉదయాన్నే సీతారామయ్యను చూసి ఒక్కసారి మంచం పైనుండి లేచి నిల్చున్నాడు.

"ఏంటి బావా!.. అప్పుడే లేచినారా!" అన్నాడు సీతారామయ్య తనను కూర్చోమని చెప్పు... అతనిని ఎలా అడగాలో తెలియక ఒక్క క్షణం పరికించాడు.

"ఏంటలా చూస్తున్నావు బావా!" అంటూ రాము ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏం లేదు... మరి... నీవు..."

"చెప్పు పరవాలేదు. డబ్బు కావాలా.. లేకపోతే మా చెల్లాయి..." అంటుండగానే

"అది కాదు! రాత్రి నేను కప్పుకున్న దుప్పటి ఎవరో దొంగలించారు. నీవు హాస్యానికి తీశావని....."

మరి అతని నోటి వెంట మాట రాలేదు. ఆ మాటకు రాము ఒక్కక్షణం ఆశ్చర్యపోతూ..

"ఏదో రాత్రి హాస్యం ఆడాను. నీ దుప్పటి నేనెందుకు తీస్తాను? హాస్యానికైనా అంతు ఉండాలి... నేను తీయలేదు.. కావాలంటే..."

"వద్దు బావా, నీ చెప్పుతో నన్ను కొట్టు! మరి ఏమీ మాట్లాడకు" అని సీతారామయ్య బైటికి నడిచాడు.

అతనివైపు అదోలా చూస్తూ రాము మౌనం వహించాడు. అలా ఆ నోటి నుండి ఈనోటి నుండి సీతారామయ్యగారి దుప్పటి దొంగతనం ఊరంతా పాకింది.

"సీతారామయ్యగారి దుప్పటి పోయిందట.. ఎవరో తీసేశారు. దొంగ వెధవలు" అని కొందరు.

"మరెవరు తీస్తారు! ఆ రామునే తీసుంటాడు.. వాళ్ళిద్దరూ ఒకరితో మరొకరు హాస్యాలాడుకోవటం అలవాటు కదా!" అని మరికొందరు అనుకున్నారు. అలా వారం రోజులు పాకింది.

ఊళ్లో అందరూ సీతారామయ్యగారి దుప్పటి పోయిందన్న విషయం మర్చిపోతున్నారు. కానీ సీతారామయ్యకు మాత్రం నిద్ర పట్టడం లేదు. ఆ దుప్పటి లేకుండా అతను మంచంలో వెన్నెలలో పడుకోవడం మానేశాడు.

ఎంత ఖరీదైన దుప్పటి అది! ఎంత మెత్తనిదో. అంత వేడిగా ఉంటుంది. అది కప్పుకొని ఎంత హాయిగా నిద్రపోయేవాడో తలచుకుంటున్నాడు.

తనపై పడిన నీలాపనింద ఎలా పోతుందా అని ఆలోచిస్తూ రోడ్డుపై తిరుగుతున్నాడు రాము.

ఒకరోజు వాడవీధి వెంబడి పోతుంటే వాడి కృష్ణయ్య ఇంటి ముందు మెరుస్తున్న కాశ్మీరు దుప్పటి కనిపించింది.

వెళ్ళి వాడిని అడిగితే ఏమనుకొంటాడోనని మౌనం వహించాడు. తనను సందేహిస్తున్న సీతారామయ్యగారి సందేహాలకు తన నిజాయితీ ఎలా తెలుపుకోవాలో తెలియడం లేదు. వాడి దగ్గరకు వెళ్ళి అడగాలనుకున్న విషయం అడగడం మర్చిపోయాడు. ఆ ఊరి రచ్చబండ దగ్గర, చెరువు గట్టు దగ్గర, పొలాల వెంట ఎక్కడ చూసినా సీతారామయ్యగారి దుప్పటి విషయాలు ఊరందరి కబుర్లే వినబడుతున్నాయి.

అలా వారంరోజులు గడిచాయి. ఆ రోజు రాము పొద్దునే లేచి పొలంలో వరి నారు వేయడానికి బయలు దేరాడు.

అంతలో అతని వెనుక "రాము గారూ" అన్న కేక వినిపించింది. వెనక్కి తిరిగి చూస్తే మంగలి కృష్ణయ్య కనిపించాడు. ఆ రోజు అతను బాగా తాగి ఉన్నాడు.

మనిషి తూలుతూ ఉన్నాడు. కళ్ళు ఎర్రగా అగ్నిగోళాల్లా మండిపోతున్నాయి.

"బాబూ నన్ను క్షమించాలి" అని రాము కాళ్లు పట్టుకున్నాడు.

"ఏంటి కృష్ణా" అన్నాడతను.

"మీరు నన్ను క్షమిస్తానంటే చెప్తాను సార్. మన సీతారామయ్యగారి దుప్పటి దొంగిలించింది నేనే సార్. నా వల్ల మీకు చెడ్డ పేరు వచ్చింది. ఆ రోజు మీరు రోడ్డు మీద పరిహాసాలాడటం నేను విన్నాను. ఆ దుప్పటి దొంగతనం చేస్తే ఆ నింద మీ మీదకు వస్తుందని నేనే తీసేశాను" అని కాళ్లు పట్టుకున్నాడు.

అతని మాటలు విన్న రామయ్యకు ఏమనాలో తెలియలేదు.

"ఆ దుప్పటి ఏది?" అని అడిగాడు.

"తాగడానికి డబ్బులు లేక అమ్మేశాను" అని చెప్పేసరికి రాము కళ్ళు తేలేశాడు.

"ఆ విషయం ఒక్క నిమిషంలోనే ఊరంతా పాకింది. రాము సీతారామయ్యతో పరిహాసాలు మానుకోవలసి వచ్చింది.

★

కొత్త పుస్తకాలు

'చిరస్మరణీయ'మే

సామ్రాజ్య వాదానికీ, బ్రిటీష్ పాలనకూ ఎదురొడ్డి పోరాడిన భరతావని ముద్దుబిడ్డల్లో ముస్లిములు కూడా కీలక పాత్ర పోషించారు. చరిత్రలో వీరులుగా, ధీరులుగా ప్రజ్వరిల్లారు. 1857 నుంచీ 1947 వరకు జరిగిన స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న వందమంది ముస్లింయోధుల వీరోచిన పాత్ర గురించి రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ 'చిరస్మరణీయులు'లో వివరించారు. బ్రిటీష్ పాలకులను ఎదిరించి పోరాడిన వైనాన్ని ప్రస్తావించారు. వాస్తవానికి ఒక్కొక్క సమరయోధుని గురించి ఎంత చెప్పినా తక్కువే. కానీ రచయిత ఒక్కొక్కరి గురించి సంక్షిప్తంగా వివరించినా... ఎక్కడా చారిత్రక వాస్తవమూ, ప్రాముఖ్యతా దెబ్బతినకుండా చెప్పడం ఆయన సృజనాత్మకతకు అద్దం పడుతోంది. ఆంగ్లేయుల ఆగడాలను అరికట్టేందుకు, స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు సమర శంఖం పూరించిన బెంగాల్ నవాబ్ సిరాజుద్దౌలా గురించీ, మీర్‌ఖాశిం గురించీ, హైదర్ అలీఖాన్ గురించీ, ముజ్నాషా షకీర్ గురించీ, వారి వీరోచిత పాత్ర గురించీ 'చిరస్మరణీయులు'లో వివరించారు. భూస్వాములకు వ్యతిరేకంగా జనచైతన్యం రగిలించి కదన రంగానికి కదిలించిన సయ్యద్ అహ్మద్ బరేల్వి, టిటూమిర్, హాజీ షరియతుల్లా, దూదూమియా లాంటి యోధుల ప్రస్తావన ఆసక్తి కలిగిస్తుంది. ఎంతో వ్యూహాత్మకంగా ఆంగ్లేయులను ఎదుర్కొన్న మొగల్ బాదుషా బహుద్దూర్, షా జఫర్, అజీముల్లాఖాన్, భక్త్‌ఖాన్, మౌల్వీ అహమ్మదుల్లా ఫైజాబాది, పఠాన్ సలాబత్‌ఖాన్‌ల గురించిన జీవన ఘట్టాలను చెప్పడంలో రచయిత తన ప్రతిభ నిరూపించారు. వీరేగాక వీర నారీమణులు బేగం హజరత్ మహల్, ముందర్, బేగం అజీజున్‌ల పోరాట పటిమను చాటిచెప్పిన ఘనత ఈ 'చిరస్మరణీయా'నికి దక్కింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసిన ఆంగ్లపాలక స్థావరమైన హైదరాబాద్ రెసిడెన్సీ మీద దాడిచేసిన పఠాన్ తుర్రేబాజ్‌ఖాన్, మౌల్వీ అల్లావుద్దీన్, ఈస్టిండియా కంపెనీ బలగాలను ఎదుర్కొనేందుకు పకడ్బందీ వ్యూహరచన చేసిన షేక్‌పీర్‌షాల జీవనఘట్టాలు పోరాట స్ఫూర్తిని కల్గిస్తాయి. ఆంగ్లపాలకుల అహంకారాన్ని అణచిన జస్టిస్ బద్రుద్దీన్, రహిమతుల్లా సయాని, ఖిలాఫత్ ఉద్యమానికి ఊపిరిపోసిన అలీ సోదరుల గురించీ, నిరంతరం పోరు సలిపిన మౌల్వీ ఒబైదుల్లా సింధీ, బర్కతుల్లా భోపాలి, మౌలానా హస్రత్ మోహాని, జస్టిస్ అబ్బాస్ తయ్యాబ్జీ, హకీం అజ్మల్‌ఖాన్, మౌలానా మజమర్రుల్‌హఖ్, ఉరికంబమైనా ఎక్కడానికి వెనుకాడని అష్ఫాఖుల్లాఖాన్ గురించీ, వీరోచిత సమరశీలి మౌలానా మహమ్మద్ హసన్, హిందూ ముస్లింల ఐక్యతకోసం పాటుపడ్డ డాక్టర్ ముక్తార్ అహమ్మద్ అన్సారీ గురించీ చదువుతుంటే స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లిం యోధుల సమర సంకల్పం ఎంత గొప్పదో అర్థమౌతుంది. బ్రిటీషువారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రైతాంగపోరాటం నడిపిన షేక్ ముహమ్మద్ గులాబ్, గాంధీజీని విషాహారం బారినుంచి కాపాడిన బతఖ్ మియా అన్సారి, ఉద్యమకారుల 'అమ్మ'గా, 'ఖుదీరాంకి దీదీ'గా ప్రఖ్యాతిపొందిన ఆబాదిబానోబేగం జీవనశైలి ఉత్తేజాన్నిస్తుంది. వీరేగాక బీబి అమతుస్సలాం, షఫాతున్నీసా బీబి, రజియా ఖాతూన్, సుగరాఖాతూన్ లాంటి మహిళా యోధుల సమర సంకల్పం, కదన కలాపం కదిలిస్తుంది. ఇంకా అనేక మంది ముస్లిం సమరయోధుల ప్రస్తావన, వివరణ, వీరోచితపాత్ర 'చిరస్మరణీయులు' పుస్తకంలో చోటు సంపాదించుకున్న వైనం ఆసాంతం ఆదర్శనీయమే. ఇందులోని సమర శీలుర జీవనవైనాన్నీ, కదన శైలినీ కళ్లకు కట్టిన రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ సంకల్పమూ, సమరయోధుల సమగ్ర రూపమైన ఆ పుస్తకమూ రెండూ 'చిరస్మరణీయ'మే.

- జావేద్



చిరస్మరణీయులు
(బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్న ముస్లిం యోధులు)
సయ్యద్ నశీర్ అహమ్మద్
వెల (సాధారణ ప్రతి) : 100/-
పేజీలు : 222
ప్రతులకు : ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్
శివప్రసాద్ వీధి, కొత్తపేట
వినుకొండ, గుంటూరు
మరియు అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు

ఆనందానికి, ఆరోగ్యానికి
నవ్వండి, నవ్వండి!
సంఘమిత్ర
వెల : 25/-, పేజీలు : 72,
ప్రతులకు :
బాలాజీ పబ్లికేషన్స్
విజయవాడ-520002.



గణితం చాలా సులభం ఎలా?
రామకృష్ణ మామిళ్లపల్లి
వెల : 20/-, పేజీలు : 64,
ప్రతులకు :
బాలాజీ పబ్లికేషన్స్
విజయవాడ-520002.



రాళ్లకు రూపం ఇవ్వడం ఒక ఆర్టు. ఇలాంటి కొన్ని ఆకారాలమీద మొక్కలు పెంచితే ఎలా వుంటుంది? హార్టు బీటు పెరిగిపోదూ! సరిగ్గా ఇక్కడి బొమ్మలను చూస్తుంటే ఇదే జరుగుతోంది. అంత పెద్ద శిల్పాలమీద కూడా సునాయాసంగా మొక్కలు పెంచేశారు. చూడ్డానికి అవి 'అచ్చంగా మొక్కలే' అన్నంత సహజంగా చేసేశారు. శిల్పం కళ్ల నుంచి వెలువడే అశ్రువులనే పూరహదారిగా మార్చేశారు. మరో శిల్పం కురుల్లో సహజంగా పూలు పూయించారు. వైకల్యం శరీరానికేగానీ మనసుకు కాదన్నట్టు ఓ ఆటగాడు ఎంత అద్భుతంగా పోజిచ్చాడోకదా. ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నట్టున్న ఈ శిల్పాలను చూస్తుంటే ఏమనిపిస్తోంది...!

ఆర్టు అదిరెనులే







చిన్నప్పుడు ఈ కథను అమ్మమ్మ నోటి వెంట విన్నాను. తర్వాత కథల పుస్తకాల్లో చదివాను. ఎన్నిసార్లు విన్నా...చదివినా ఏదో తెలీని ఉత్కంఠ వెంటాడుతుండేది. ఆ తర్వాత ఏమౌతుంది? అన్న ప్రశ్న ఎన్నిమార్లు ఉదయించిందో చెప్పలేను.

మంచి మనస్సున్నవారిది ఎప్పుడూ పై చేయే. విజయలక్ష్మి వారినే వరిస్తుంది. కుళ్లు, కుతంత్రాలు, స్వార్థం, దురాశతో తలమునకలయ్యేవారికి చివరికి అందే బహుమతి ఓటమే. ఇలాంటి మరెన్నో మంచి విషయాలను చెప్పకనే చెప్పే ఈ కథను మీక్కూడా మరోసారి చెప్పాలనిపించింది. మరి ఆలస్యమెందుకు.. మొదలెట్టండి!

అలీబాబా 40 దొంగలు

కథలోకి వెళ్లాలంటే కొన్ని వేల సంవత్సరాల వెనక్కిపోవాలి. అప్పట్లో పర్షియా దేశంలో ఓ పెద్ద పట్టణం వుండేది. అందులో తోళ్ల వ్యాపారి ఒకడు వుండేవాడు. అతనికి ఇద్దరు కొడుకులు. ఒకడు కాశిం బాబా, మరొకడు అలీబాబా. చివరిక్షణాల్లో తనకున్న కొద్దిపాటి ఆస్తిని కుమారులిద్దరికీ సమంగా పంచుతాడు ఆ వ్యాపారి. కాశిం బాబా మంచి ధనవంతుడి కుమార్తెను పెళ్లాడతాడు. దాంతో అతను పెద్దగా కష్టపడకుండానే డబ్బు వస్తుంది. అలీబాబా మాత్రం పేదింటి పిల్లను చేసుకుంటాడు. ప్రతి రోజూ అడవికి వెళ్లి కట్టెలు తెచ్చుకుని అమ్మి జీవనం సాగిస్తుంటాడు.

ఎప్పటిలాగే ఆరోజు కూడా అడవికి వెళ్తాడు అలీబాబా. ఎంత వెతికినా అతనికి ఎండుకట్టెలు కనిపించవు. దాంతో మరింత ముందుకు వెళ్తాడు. అక్కడ ఎలాగో ఒక చెట్టుకి ఎండు కొమ్మలు కనిపిస్తాయి. వాటిని కొట్టుకొని సంతోషంగా గాడిదపైకి ఎక్కిస్తాడు. అలా తిరిగి వస్తుండగా...గుర్రపు డెక్కల శబ్దం వినిపిస్తుంది. దానితోపాటు ఆకాశాన్ని కమ్ముకున్న దుమ్ము మేఘాలు కనిపిస్తాయి. దాన్నిబట్టి తను విన్నది ఒకటో రెండో గుర్రాల డెక్కల చప్పుడు కాదని, చాలా గుర్రాలు అటుగా వెళుతున్నాయని భావిస్తాడు అలీబాబా. దోపిడీ దొంగలే అలా అన్ని గుర్రాల మీద వస్తారని తండ్రి చెప్పగా విన్నాడు. వెంటనే గాడిదను పొదల్లోకి లాక్కెళ్లి కట్టేస్తాడు. తను ఒక పెద్ద చెట్టుచాటుకు చేరతాడు. కొద్దిసేపటికే గుర్రాల డెక్కల శబ్దం బాగా దగ్గరైనట్టనిపిస్తుంది.

చూస్తుండగానే గుర్రాల మీద ముసుగులు ధరించిన వారు కొందరు కనిపిస్తారు. వారు ఒక గుహ దగ్గర వరుసగా కిందకు దిగుతుంటారు. గుర్రాల వెనకున్న మూటలు చూసేసరికి వారు దోపిడీ దొంగలేనన్న విషయం స్పష్టమౌతుంది. దాంతో అతనిలోని ఆసక్తి వంద రెట్లు పెరుగుతుంది. వారంతా అక్కడ ఏం చేస్తారో చూడాలని మరింత ఉత్కంఠగా ఎదురుచూస్తుంటాడు. ఈలోగా దొంగల నాయకుడు అందరికంటే ముందుకొచ్చి గుహ ముందు నిలబడి చేతులు చాచి...

"బీబీ బీగం రాస్తా చోడో" అంటాడు. అలా ...డోసారి అన్న వెంటనే గుహ ద్వారం పెద్దగా శబ్దం చేస్తూ తెరుచుకుంటుంది.

తాము దోచుకొచ్చిన మూటలన్నీ తీసుకుని లోపలికెళ్తారు దొంగలు. వాటిని లోపల సర్దాక అంతా బయటికి వచ్చేస్తారు. దొంగల నాయకుడు గుహ ముందు నిలబడి

"బీబీ బీగం రాస్తా బంద్" అని మూడుసార్లు అరుస్తాడు. వెంటనే పెద్ద శబ్దం చేస్తూ ద్వారం మూసుకుంటుంది. అంతా గుర్రాలెక్కి వెళ్లిపోతారు.

దొంగలు గ్రామాలమీద పడి దోచుకున్న సొమ్మంతా ఆ గుహలో దాచుకుంటున్నారని అర్థమౌతుంది. వెంటనే దొంగల నాయకుడి మాదిరిగానే గుహ ముందు నిలబడి

"బీబీ బీగం రాస్తా చోడో" అంటాడు మూడుసార్లు.

ద్వారం తెరుచుకుంటుంది. లోపలికెళ్లిన అలీబాబాకు కళ్లు చెదిరిపోయేంత బంగారం, డబ్బు, విలువైన వజ్రాలు కనిపిస్తాయి. వాటిని అతను కలలో కూడా చూసి ఎరగడు. దాంతో చాలాసేపు మాట లేకుండా నిలబడిపోతాడు. ఎప్పటికో తేరుకొని గాడిద మీదున్న కట్టెలు తీసిపారేసి ఒక గోతాం నిండా నగలు, డబ్బు, వజ్రవైఢూర్యాలు పోసుకుని బయటపడతాడు. తర్వాత గుహ బయట నిలబడి

"బీబీ బీగం రాస్తా బంద్" అని మూడుసార్లు అరుస్తాడు. ద్వారం మూసుకుపోతుంది. సంతోషంగా ఇల్లు చేరతాడు. భార్యకు పొల్లుపోకుండా విషయం అంతా చెప్తాడు. తను కట్టెల కోసం అడవి లోపలికి వెళ్లడం, దొంగలు కనిపించడం, వారు గుహను తెరవడం, మూయడం, తర్వాత తను వెళ్లడం, గోతాంలో బంగారం మూట కట్టుకొని ఇంటికి రావడం...అంతా జరిగింది జరిగినట్టు చెప్తాడు.

ఆ సంపదంతా చూసి అతని భార్య చాలా సంతోషిస్తుంది. అయితే అదంతా లెక్కించి దాచిపెట్టాలనుకుంటారు. అందుకు మానిక అవసరమౌతుంది. తోడికోడలు దగ్గరకెళుతుంది అలీబాబా భార్య. "ఏరోజు సరుకులు ఆరోజు తెచ్చుకుని బతికే వాళ్లకి మానికతో పనేంటబ్బా..." అన్న అనుమానం వస్తుందామెకు. వెంటనే మానిక లోపలివైపున కొద్దిగా చింతపండు అతికించి ఇస్తుంది.

(అలీబాబా వదినకు అసలు విషయం తెలుస్తుందా? ఆ తర్వాత ఏమైంది? తెలియాలంటే వారం రోజులు ఆగాల్సిందే)

పునఃకథనం: కె. చరిత